teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 190 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 6 నవంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## ఇంటర్మీడియట్ ఎగ్జామ్ ఫీజు చెల్లింపులకు తేదీలు ఖరారు




తెలంగాణ బ్యూరో, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ ఎగ్జామ్ ఫీజు చెల్లింపులకు ఇంటర్ బోర్డు తేదీలను ఖరారు చేసింది. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు మార్చి- 2025కు సంబంధించిన పరీక్ష ఫీజు షెడ్యూల్, ఫీజు వివరాలను బోర్డు విడుదల చేసింది. విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా నవంబర్ 06 నుంచి నవంబర్ 26 తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. రూ.100 ఆలస్య రుసుముతో నవంబర్ 27 నుంచి డిసెంబర్ 04 వరకు పరీక్ష ఫీజు

మిగతా 2 లో



# నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

### ముందుగానే కోతకు వచ్చిన పంట.. ఆందోళనలో రైతులు

- సుమారు 50 ఎకరాల్లో పంట నష్టం
- ఆమని సీడ్స్ కంపెనీపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు
- న్యాయం కోసం రైతుల తండ్లాట



కోతకు వచ్చిన పంట (ఎడమవైపు), కోతకు రాని పంట (కుడివైపు)




ములుగు జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ములుగు మండలం కన్నాయిగూడెము గ్రామంలో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచాయి. 140 రోజులకు రావాల్సిన క్రాప్ 3 నెలల్లోనే రావడంతో రైతులు ఒక్కసారిగా షాక్ కి గురయ్యారు. ఆమని సీడ్స్ వద్ద 10 నుంచి 15 మంది రైతులు దాదాపుగా 50 ఎకరాల్లో గాను వరి సీడ్ విత్తనాలు కొనుగోలు చేయగా ఆమని సీడ్ కంపెనీ ఏజెంట్ చేసిన మోసానికి రైతులు ఆగమయ్యారు. మొన్న పడ్డటువంటి వర్షాలకు పంట

మిగతా 2 లో



> **పంటనే నమ్ముకొని వేల రూపాయలు ఖర్చుపెట్టాం**
>
> వరి మొత్తం నెలకొరిగింది. మొన్న పడ్డ వర్షాలకు వరిగొలుసు రాలిపోయింది. పంటనే నమ్ముకొని వేల రూపాయలు ఖర్చుపెట్టాం. విత్తనాలకు, పురుగు మందులకు, కూలి పని వాళ్లకు ఇలా ప్రతి దానికి పైసల తోటే పని, రాత్రింబవళ్ళు కష్టపడ్డం, కానీ పంటలు ఇంత త్వరగా క్రాప్ కు వచ్చి ఇంత నష్టాన్ని చేకూరుస్తాయి అనుకోలేదు. ఇట్టి నకిలీ విత్తనాల కంపెనీ పై సత్వరమే చర్యలు తీసుకోని మాకు న్యాయం చేయాలి, ప్రభుత్వం, అధికారులు మమ్మల్ని ఆదుకోవాలి.
>
> - రైతు ఎం.డి రైహీమోద్దీన్

## మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారం కానుందన్న మంత్రి


### ఎయిర్ పోర్ట్‌ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తాం

- అత్యుత్తమ నగరంగా వరంగల్ ను అభివృద్ధి చేస్తాం
- ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు



వరంగల్ జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలోనే సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ లిమిటెడ్ వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు అంగీకరించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలోనే మామునూరు ఎయిర్ పోర్ట్ పనులు

మిగతా 2 లో




## నేటి నుండి మొదలు.. ఇంటింటి కుటుంబ సర్వే

- సమగ్ర వివరాలు సేకరనకు ప్రభుత్వ ఆదేశం
- సర్వేకు సంబంధించి మొత్తం 56 ప్రశ్నలు తయారీ

.. వివరాలు 2లో



## రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు

- ఎక్కువ లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్లాన్
- కుటుంబ సర్వే తర్వాత అర్హులందరికీ రేషన్ కార్డులు

తెలంగాణ బ్యూరో, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఇప్పటి వరకు ప్రభుత్వ పథకాలు అమలు ఒక ఎత్తు అయితే ఇప్పుడు అమలు చేయబోయే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో ఎత్తు. ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. అందుకే నిబంధనల్లో కాస్త సడలింపులు ఇస్తోంది. రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడానికి సిద్ధమవుతున్న మంత్రి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలో మాట్లాడిన

మిగతా 2 లో

## అందుబాటులోకి రానున్న మొబైల్ టెస్టింగ్ వెహికిల్స్

- ఎక్కడైనా ఫుడ్ కల్తీ జరిగితే కఠిన చర్యలు
- మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి




హైదరాబాద్, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో త్వరలో మొబైల్ టెస్టింగ్ వెహికిల్స్ అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఎక్కడైనా ఫుడ్ కల్తీ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో

మిగతా 2 లో

## హైదరాబాద్ నగర పౌరులకు హైకోర్ట్ అలర్ట్ జారీ



రోడ్లపై వాహనాలు నడిపితే హెల్మెట్ తప్పనిసరి

02

## శ్రీ భద్రకాళి దేవస్థానానికి ప్రతిష్టాత్మక అవార్డు




- మంత్రి రాజానర్సింహా చేతులమీదుగా అందుకున్న ఆలయ ఈఓ
- బాధ్యతల పట్ల నిబద్ధతకు నిదర్శనం : ఈఓ శేషుభారతి

.. వివరాలు 2లో

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి ధ్వజమెత్తిన కేటీఆర్

### ఇదేనా కాంగ్రెస్ తీసుకొచ్చిన మార్పు అంటూ ఏద్దేవా



హైదరాబాద్, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి ధ్వజమెత్తారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ రాష్ట్రంలో మార్పు

మిగతా 2 లో



## రాష్ట్రంలో నేటి నుంచి ఒంటి పూట బడులు

- కులగణన సర్వే లో ప్రభుత్వ ప్రాథమిక స్కూళ్ల టీచర్లు
- మూడు వారాలపాటు కుల గణనలో పాల్గొననున్న టీచర్లు

02




## నీటి నిర్వహణ పట్ల అవగాహన 15 రోజుల జల్ ఉత్సవ్

నేటి నుండి ప్రారంభమవనున్న ఉత్సవ్

02

# నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు



మొదటి పేజీ తరువాయి

కొంత దెబ్బతినగా అనుకున్న దానికంటే ముందుగానే క్రాప్ రావడంతో వరి పంట అంతా నేలకు ఒరిగింది. అటు కోతలు కోయలేక, నీళ్లలో కుప్పలు పెట్టలేక, కోత మిషన్లు అటువైపు వెళ్లే పరిస్థితి లేక రైతుల అవస్థలు పడుతున్నారు. నకిలీ విత్తనాలతో పాయిరాల బిక్షపతి, గొల్ల రఘు, ఎండి రహీం, అజ్మీర రాజు, డబ్బా కట్ల సారంగపాణి, అల్లెం రాజు, అల్లెం రాకేష్, సంతోష్, రమ పలువురు రైతులు అధిక మె-ుత్తంలో నష్టపోయారు. భూమినే నమ్ముకున్న తమకు ఇప్పుడు బుక్కెడు బువ్వే కరువైనట్టు గోచరిస్తున్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక పంట కోసం తెచ్చిన అప్పులు మీదపడతాయంటూ ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.






## ఆరుగాలం కష్టపడ్డ పంట నష్టాన్ని మిగులుస్తున్నది

### కోత మిషన్లు రాలేని పరిస్థితి.. చుట్టూ పచ్చటి పొలాలే రైతు గోళ్ళ రఘు



చేతికిచ్చిన వరి పంట కోత కోసి కుప్ప పెడదాం అనుకున్న కూడా కింద బురద నీళ్లు, కోత మిషన్లు రాలేని పరిస్థితి, ఎటు చూసినా పచ్చటి పొలాలే మధ్యలో మా పొలం వరి గొలుసు అయ్యి నేలకు ఒరుగుతుంది. సగం పంట దోమకాటుతో దెబ్బతింటుంది. ఆరుగాలం కష్టపడ్డ పంట 80% వరకు నష్టాన్ని మిగులుస్తుంది. ఆమని సీడ్స్ చేసిన మోసానికి రైతులమంతా ఆగమయ్యాం ప్రభుత్వమే చొరవ తీసుకొని మమ్ములను పట్టించుకోవాలి.

## ముందుగానే కోతకు రావడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాం

### ప్రభుత్వం, అధికారులు మమ్మల్ని ఆదుకోవాలి రైతు పావురాల బిక్షపతి



ఆమని సీడ్స్ ఏజెంట్ అశోక్ మాటలు నమ్మి అంతా నష్టపోయాం. అన్ని పంటలతో క్రాప్ కు రావలసిన వరి పంట ముందుగానే క్రాప్ కు రావడంతో దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నాం. కోత కోసి వరికుప్పలు పోద్దామన్న మిషన్లు పోలేని పరిస్థితి, వరికుప్పలు పెడదామన్నా ఇంకిపోని నీళ్లు, చుట్టు పచ్చని పొలాలు ఇంకా నీటిపారకం అందుకుంటున్న వరి పంటలు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి వరి మొత్తం నేలకొరిగింది. వర్షాలు ఒకవైపు అయితే, పంట ముందుగానే చేతికి వచ్చి పంట నష్టపోయే పరిస్థితి. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

## న్యాయం చేయాలంటూ పోలీస్ స్టేషన్ మెట్లెక్కిన రైతులు

### సీడ్ కంపెనీపై చర్యలు తీసుకోని న్యాయం చేయాలి: రైతులు

నకిలీ విత్తనాలతో మమ్ములను నమ్మించి మోసం చేసిన ఆమని సీడ్ కంపెనీ పైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రైతులు ములుగు పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అన్ని పంటలతో పాటుగానే 140 రోజులకి పంట చేతికి వస్తుందని విత్తనాలు తీసుకున్నందుకు మాకు ఊహించరు మోసం జరిగిందంటూ రైతులు వాపోయారు. జరిగిన నష్టాన్ని సీడ్ యజమానికి వివరించినా పట్టించుకోవట్లేదు అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అందుబాటులోకి రానున్న మొబైల్ టెస్టింగ్ వెహికిల్స్

మొదటి పేజీ తరువాయి

స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు లైసెన్సు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ అంటే బిర్యాని గుర్తుకు వస్తుంది. నాచారంలోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ను ఆధునీకరించడంతో పాటు మరో 4 లేదా 5 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేస్తం. ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్, ప్రభుత్వ హాస్టల్స్ లో మంచి ఫుడ్ అందించాలి. చిన్న,పెద్ద హెూటల్స్ నడిపే వారు రిజిస్ట్రేషన్, లైసెన్స్ తీసుకోవాలి. మంచిగా హెూటల్స్ నడుపుకుంటే ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది అని హామీ ఇచ్చారు.

## శ్రీ భద్రకాళి దేవస్థానానికి ప్రతిష్టాత్మక అవార్డు




వరంగల్, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానానికి మంగళవారం ఉదయం హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్ లో గల నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ మరియు వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్లో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి శేషభారతికి ఈట్ రైట్ ప్లేస్ అఫ్ వర్షిప్ సర్టిఫికెట్ (%దీనా+%) ను అందజేయడం జరిగింది. ఇట్టి సర్టిఫికెట్ ను వివిధ రకాలైన తనిఖీలు మరియు ఆడిట్ నిర్వహించిన తదుపరి శిక్షణ పొందిన సిబ్బందికి, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ముడి సరుకులను వినియోగించిన వారికి, ప్రసాదములు తయారు చేయు ప్రదేశంలో పరిశుభ్రత పాటించిన వారికి మరియు సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత ఇటువంటి ప్రమాణాలు పాటించిన వారికి మాత్రమే భారత ప్రభుత్వ ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థచే ఈట్ రైట్ ప్లేస్ అఫ్ వర్షిప్ సర్టిఫికెట్ (%దీనా+%) ను ఫిబ్రవరి 2024 మాసంలో ఈ దేవస్థానమునకు జారీ చేయడం జరిగినది. ఇట్టి సర్టిఫికెట్ ని మంగళవారం మంత్రి చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణాధికారి శేషభారతి మాట్లాడుతూ శ్రీ భద్రకాళి దేవస్థానానికి ఈ ఉన్నత అవార్డు రావడం గర్వకారణం, సంతోషంగా ఉందని, దీని వెనుక ఏంతో నిబద్దత, బాధ్యతాయుతమైన ప్రణాళికలు కలవని అన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి ధ్వజమెత్తిన కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

తీసుకొస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాడ్డాక ఏం మార్పులు తీసుకొచ్చిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ఇప్పుడు హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటేనే బిల్డర్లు హడలిపోతున్నారని, ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పు అంటూ నిలదీశారు. తెలంగాణ రియల్టర్స్ ఫోరం సమావేశంకు మంగళవారం మధ్యాహ్నం హాజరైన కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. తెలంగాణలో ఎక్కడైనా ఎకరం భూమి ధర రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల కంటే తక్కువ లేదు.ఇవాళ తెలంగాణలో రియల్ ఎస్టేట్ మార్కెట్ ఎలా ఉందో అందరికి తెలుసు. మార్పు మార్పు అని ఊదర కొట్టింద్రు. మార్పు బాగుందా?
నన్ను ఇటీవలే కల్సిన ఒక బిల్డర్ పరిస్థితులు బాగా లేవని అన్నారు, నాకు తెలిసిన ఒకే ఒక విద్య రియల్ ఎస్టేట్ అని ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి అన్నారు. 11 నెలల నుంచి చూస్తున్న ఒక్క పాజిటివ్ నిర్ణయం లేదు ఇప్పుడు రియల్ ఎస్టేట్‌కు అనుమతులు గాలిలో దీపం. హైడ్రా బ్లాక్ మెయిల్ చేసే%శీ%దుకు ఇవాళ ఎవరైనా లేక్ వ్యూ అని పెట్టుకోవాలంటే భయపడుతున్నారు. ప్రాజెక్టు లు రద్దు ఒక్క కొత్త ప్రాజెక్టు వద్దు అన్నట్టు ఉంది కాంగ్రెస్ సర్కార్ పరిస్థితి అంటూ విమర్శించారు కేటీఆర్.

# మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందన్న మంత్రి

మొదటి పేజీ తరువాయి

ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రోజు మర్రిచెన్నా రెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి లు వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి పై కూలంకషంగా చర్చించారు. మామునూరు ఎయిర్ పోర్టు, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాజీపేట రోడ్ ఓవర్ బ్రిడ్జ్, భద్రకాళి దేవాలయ మాఢవీధుల పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత, కూడా పరిధి విస్తరణ, జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ తదితర అంశాల మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, వరంగల్ నగర పురోభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్ట్ కు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇప్పటికే జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ప్యాసింజర్ సర్వీసులతో పాటు కార్గో సేవలు అందించే దిశగా మామునూరు ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రితో చర్చిస్తామని మంత్రి సురేఖ చెప్పారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు పై మంత్రులు చర్చించారు. కార్గో సర్వీసులు అందుబాటులోకి వస్తే కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ ఉత్పత్తుల రవాణాకు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల రాకపోకలకు ఉపయుక్తంగా వుండి వరంగల్ నగర పురోగతి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఊతంగా నిలుస్తుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తెచ్చి చేతల ప్రభుత్వంగా నిరూపించుకున్నదని మంత్రి సురేఖ తెలిపారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ ను వేగంగా అమలుచేసేలా ప్రత్యేక అధికారిని నియమించాలని మంత్రి సురేఖ, వరంగల్ ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ను ఆదేశించారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలనీ, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను నిర్దేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ పనులు కట్టుదిట్టంగా చేపట్టాలని, వీటికి అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు మార్గనిర్దశనం చేశారు. 41 కిలోమీటర్ల వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మొదటి దశలో 20 కి.మీలు, రెండవ దశలో 10 కి.మీలు, మూడవ దశలో 9 కి.మీల రోడ్డు పనులు చేపట్టేలా ప్రణాళికను అమలు చేయాలని మంత్రులు సూచించారు. ఇందుకు 911 ఎకరాల భూసేకరణ చేయాల్సి వుందని అధికారులు తెలిపారు. భద్రకాళీ దేవాలయానికి అనుబంధంగా వున్న భద్రకాళి చెరువు పూడికతీత పనులను వెనువెంటనే ప్రారంభించాలని మంత్రులు అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డిపిఆర్ ను వెంటనే సిద్ధం చేసి, వేగంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెలలో కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# నేటి నుండి మొదలు.. ఇంటింటి కుటుంబ సర్వే

తెలంగాణ బ్యూరో, నవంబర్ 06 (తీన్మార్ న్యూస్): నవంబర్ 6వ తేదీ నుంచి తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేలో భాగంగా సమగ్ర వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. సర్వేకు సంబంధించి మె-ుత్తం 56 ప్రశ్నలు తయారుచేశారు. ప్రతీ కుటుంబం నుంచి ఆ ప్రశ్నలకు సంబంధించిన వివరాలు సేకరిస్తారు. అయితే అసలు ఈ సర్వేలో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు, సర్వే ఎలా చేస్తారు, దీని ఉద్దేశం ఏంటీ, ఓసారి చూద్దాం.

1.తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు తీసుకున్న అప్పులపై ప్రత్యేకంగా మూడు ప్రశ్నలు అడుగుతారు. గత ఐదేళ్ల కాలంలో ఏమైనా అప్పులు తీసుకున్నారా.. ఎందుకు తీసుకున్నారు.. ఎక్కడి నుంచి తీసుకున్నారు అనే ప్రశ్నలు అడగనున్నారు. వీటికి వివరంగా సమాధానం చెప్పాలి. బ్యాంకులు, ఎస్‌హెచ్‌జీ నుంచే కాకుండా వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్నారా అనే వివరాలను చెప్పాలని ప్రభుత్వం కోరింది.

2.గత ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి ఏమైనా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారా? ఆ పథకాల ఏంటి? వీటి వివరాలు కూడా సేకరిస్తారు. కచ్చితమైన సమాచారం సర్వే చేసే వారికి ఇవ్వాలి.

3.కుటుంబ సభ్యులందరి ఆస్తుల వివరాలకు సంబంధించి కూడా ప్రశ్నలు ఉన్నాయి. ద్విచక్రవాహనం, కారు, వాషింగ్ మిషన్, ఫ్రిజ్, ఏసీ, టీవీ, స్మార్ట్‌ఫోన్ ఇలా మొత్తం 18 రకాల వివరాలు చెప్పాల్సి ఉంటుంది.

4.ఇంటికి సంబంధించిన ప్రశ్నలు కూడా అడుగుతారు. ఇల్లు ఎన్ని గజాల్లో.. ఏ ప్రాంతంలో ఉంది? మొత్తం గదులెన్ని.. బాత్‌రూం, మరుగుదొడ్డి ఉన్నాయా ఇలాంటి వివరాలన్నీ చెప్పాలి. భూమికి సంబంధించి.. ఎంత భూమి, ఎన్ని ఎకరాలు, అది పట్టా భూమా? ప్రభుత్వం ఇచ్చిన ఎసైన్డ్ ల్యాండా, పట్టాలేని అటవీ భూమా.. ఈ వివరాలు స్పష్టంగా చెప్పాలి.

5.ఈ సమగ్ర కుటుంబ సర్వేలో యజమాని, సభ్యుల వివరాలను నమోదు చేసుకుంటారు. దీంతోపాటు కుటుంబంలోని ప్రతి ఒక్కరి ఫోన్ నంబరు, వారుచేసే పని, ఉద్యోగ వివరాలను సేకరిస్తారు.

6.తెలంగాణలో సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే చేయడానికి శాసనసభ తీర్మానం మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

7.ఈ సర్వే ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి అవకాశాలు మెరుగుపరిచేందుకు, అన్నివర్గాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సర్వేకు ప్రణాళి కశాఖ నోడల్ విభాగంగా వ్యవహరించనుంది.

8.తెలంగాణ వ్యాప్తంగా సుమారు 80 వేల మంది ఈ సర్వేలో పాల్గొంటారు. వీరిలో విద్యాశాఖ నుంచి 48,229 మంది ఉన్నారు. టీచర్లే కాకుండా ఇతర కేటగిరీల ఉద్యోగులను కూడా సర్వేకు వినియోగించే అవకాశం ఉంది.

9.జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ సర్వే జరగనుంది. జిల్లా, మండల నోడల్ అధికారులు.. ఎన్యూమరేషన్ బ్లాక్‌ల గుర్తింపు, సర్వే చేసేవారి నియామకం, ఇళ్ల జాబితా, డేటా ఎంట్రీ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తారు.

10.ఈ సర్వే చేయడానికి గ్రామాల్లోని ఇళ్లను ఈబీలుగా విభజిస్తారు. ఒక గ్రామంలో కనీసం 175 కుటుంబాలుంటే మొత్తంగా దాన్ని ఒకే ఈబీగా నిర్ణయించి ఒక సర్వే అధికారికి అప్పగిస్తారు. అంతకన్నా ఎక్కువ ఉంటే.. వాటిని చిన్న యూనిట్లుగా.. అప్పగిస్తారు. నవంబర్ నెల ఎండింగ్ వరకు సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## రాష్ట్రంలో నేటి నుంచి ఒంటి పూట బడులు

తెలంగాణ బ్యూరో, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో నేటి నుంచి ఒంటి పూట బడులు మొదలు కానున్నాయి. ప్రభుత్వం చేయనున్న కులగణన సర్వే లో ప్రభుత్వ ప్రాథమిక స్కూళ్ల టీచర్ల ను వినియోగించుకోనుంది. ఈ నేపథ్యంలోనే ప్రైమరీ స్కూల్స్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పని చేస్తాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఆయా స్కూళ్ల టీచర్లు మూడు వారాలపాటు కుల గణనలో పాల్గొంటారని, కాబట్టి ప్రాథమిక పాఠశాలలు మధ్యాహ్నం వరకే పనిచేస్తాయని పేర్కొంది. ప్రాథమిక పాఠశాలలు ఒంటి గంట వరకు పనిచేసిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాల్సిందేనని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సర్వే పూర్తయ్యే వరకు ఈ ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ఈ సర్వేను ఈ నెల 30 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 36,559 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 3,414 మంది ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సేవలను కుల గణనకు వినియోగించుకుంటున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే ఈ ఒంటిపూట బడులు కేవలం ప్రైమరీ పాఠశాలలకే వర్తించనుందని, హైస్కూళ్లు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని ప్రభుత్వం పేర్కొంది.

## నీటి నిర్వహణ పట్ల అవగాహన 15 రోజుల జల్ ఉత్సవ్

న్యూ ఢిల్లీ, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): నీటి నిర్వహణ, సంరక్షణ మరియు సుస్థిరత పట్ల అవగాహన మరియు సున్నితత్వాన్ని సృష్టించేందుకు నీతి ఆయోగ్ నేటి నుండి 15 రోజుల జల్ ఉత్సవ్ ను ప్రారంభించనుంది. గత ఏడాది డిసెంబరులో జరిగిన 3వ ప్రధాన కార్యదర్శుల సదస్సులో 'నది ఉత్సవ్' తరహాలో 'జల్ ఉత్సవ్' ఆలోచనను రూపొందించిన ప్రధాని నరేంద్ర మోడీ దృష్టిని అనుసరించి ప్రచారం జరుగుతోంది. నవంబర్ 6 నుంచి 24 వరకు 20 ఆకాంక్ష జిల్లాలు, బ్లాక్‌లలో జల్ ఉత్సవ్‌ను అమలు చేస్తున్నట్లు నీతి ఆయోగ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది నేషనల్ జల్ జీవన్ మిషన్, డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ డిపార్ట్‌మెంట్, జల్ శక్తి మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో. 20 రాష్ట్రాలలో ప్రారంభించబడిన ఈ ఉత్సవం నీటి వనరుల సంరక్షణ మరియు పరిరక్షణలో సమాజ భాగస్వామ్యాన్ని ఊహించింది. ఇది గృహాలలో సమర్థవంతమైన నీటి వినియోగం మరియు యుటిలిటీలు మరియు ఏజెన్సీల మధ్య నీటి నిర్వహణ పట్ల బాధ్యత భావాన్ని కలిగించడానికి ప్రయత్నిస్తుంది. పాఠశాల విద్యార్థులు నీటి నిర్వహణ కార్యకలాపాలలో ఈ చొరవలో నమోదు చేయబడుతున్నారు, వారి కుటుంబాలు మరియు సమాజాలలో మార్పు కోసం ఉత్ప్రేరకాలుగా పనిచేయడానికి వారిని శక్తివంతం చేస్తున్నారు. పక్షం రోజుల పాటు జరిగే ఈ పండుగ 'జల్ బంధన్'తో ప్రారంభించబడుతుంది - ప్రముఖ వ్యక్తులు మరియు స్థానిక నాయకులచే నీటి ఆస్తులపై పవిత్రమైన దారాన్ని వేయడం. వారు తమ బ్లాక్‌లు మరియు జిల్లాల "జల్ సంపదపై ఫాక్ట్ షీట్"ని కూడా ప్రారంభిస్తారు.

## రేషన్ కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇళ్లు

మొదటి పేజీ తరువాయి

గృహ నిర్మాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ గుడ్ న్యూస్ చెప్పారు. రేషన్ కార్డు లేకపోయిన పేదలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే మొదటి విడతకు మాత్రమే ఇది పరిమితం అవుతుందని తెలిపారు మంత్రి. ప్రస్తుతం జరుగుతున్న కుటుంబ సర్వే పూర్తి అయిన తర్వాత అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చేస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి అందరికీ రేషన్ కార్డులు లేనందున ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దీన్ని చేర్చడం లేదన్నారు. తర్వాత విడుత నుంచి మాత్రం రేషన్ కార్డు కంపల్సరీ చేయబోతున్నట్టు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ఎప్పుడే ప్రారంభించిన ప్రభుత్వం తొలి విడతలో ఇంటి స్థలం ఉండి గృహాలు లేని వారిపై ఫోకస్ పెట్టింది. వీళ్లకు ఇళ్లు కట్టించే ఇచ్చే బాధ్యత భుజాన వేసుకుంది. రెండో విడతలో స్థలం కూడా లేని వారికి ఇళ్లు కట్టించి ఇస్తారు. నవంబర్ ఆరు నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రారంభమవుతుంది. దీని కోసం ప్రత్యేక యాప్ను రూపొందించారు. ఒకసారి సమాచారం సేకరించిన తర్వాత దాని ఆధారంగా గ్రామసభలు ఏర్పాటు చేసి అర్హులను నిర్ణయిస్తారు. నవంబర్ 15వ తేదీ నుంచి 20 మధ్య ఈ గ్రామసభలు జరగనున్నాయి. గ్రామస్థులు సమక్షంలో అర్హులు ఖరారైన తర్వాత వారికి స్థలం కేటాయిస్తారు. కేంద్రం చెప్పిన నిబంధనల ప్రకారం 80 గంజాల వరకు స్థలం ఇస్తారు. ఆయా గ్రామాల్లో స్థలం అందుబాటులో ఉంటే సరేసరి లేకుంటే కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇస్తారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పర్యవేక్షణకు అధికారులను ప్రభుత్వం నియమించనుంది. ఈ నిర్మాణాలకు ఉచితంగా ఇసుక, రాయితీపై మిగతా నిర్మాణ సామగ్రి సప్లై చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. నియోజకవర్గానికి తొలి దశలో 3,500 ఇళ్లు కేటాయించి అవి నిర్మాణాల పూర్తి అయిన తర్వాత రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఇలా ఐదేళ్లలో తెలంగాణ వ్యాప్తంగా 20 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## హైదరాబాద్ నగర పౌరులకు హైకోర్ట్ అలర్ట్ జారీ

హైదరాబాద్, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ నగర పౌరులకు హైకోర్ట్ ఓ ముఖ్యమైన అలర్ట్ జారీ చేసింది. ఇకపై నగర రోడ్లపై వాహనాలు నడిపే వారంతా హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేసింది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేసింది. అలాగే హెల్మెట్ లేకుండా వాహనం నడిపడం, రాంగ్ రూట్లో వాహనాలు నడిపితే విధించే జరిమానాను మరింత పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ఇది వరకు రూ.100 గా ఉండగా ప్రస్తుతం రూ.200 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రాంగ్ రూట్లో వాహనం నడిపితే ఇది వరకు రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉండగా ఇపుడు రూ.2000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు హైకోర్ట్ మంగళవారం ఉత్తర్వులు విడదల చేసింది.

## ఇంటర్మీడియట్ ఎగ్జామ్ ఫీజు చెల్లింపులకు తేదీలు ఖరారు

మొదటి పేజీ తరువాయి


చెల్లించవచ్చు.

- రూ. 500 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 05 నుంచి డిసెంబర్ 11 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.
- రూ. 1,000 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 12 నుంచి డిసెంబర్ 18 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.
- రూ.2,000 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 19 నుంచి డిసెంబర్ 27 వరకు పరీక్ష ఫీజు చెల్లించవచ్చు.

**ఫీజు చెల్లింపుల వివరాలు**

- ఫస్టియర్- జనరల్ రెగ్యులర్: రూ. 520
- ఫస్టియర్- ఒకేషనల్ రెగ్యులర్: రూ. 750
- సెకండియర్- జనరల్ కోర్సెస్ (జనరల్ ఆర్ట్స్: రూ. 520, జనరల్ సైన్స్: రూ. 750)
- సెకండియర్- ఒకేషనల్ రెగ్యులర్: రూ. 750

## మెట్రో రైళ్ల సాంకేతిక సమస్యపై స్పందించిన ఎండీ



హైదరాబాద్, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో సోమవారం ( నవంబర్ 4, 2024 ) మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యలు తలెత్తి ఎక్కడిక్కడ ఆగిపోయిన సంగతి తెలిసిందే. మెట్రో రైళ్లు ఆగిపోవడంతో అటు స్టేషన్లో ప్రయాణికులు, ఇటు రైళ్లలో ఉండిపోయిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సుమారు గంట పాటు మెట్రో సేవలకు అంతరాయం ఏర్పడటంతో మెట్రో స్టేషన్లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఇదిలా ఉండగా మెట్రో రైళ్లలో తలెత్తిన సాంకేతిక సమస్యలపై హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పందించారు. మెట్రో రైళ్లలో అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు వస్తుంటాయని అన్నారు. మీడియా ఇలాంటివాటిపై ఎక్కువగా ఫోకస్ చేస్తోందని అన్నారు. ప్రపంచంలో సక్సెస్ అయిన మెట్రోలలో హైదరాబాద్ మెట్రో ఒకటిగా నిలిచిందని అన్నారు. 2010లో బిడ్ ప్రాసెస్ కి వెళ్తే ఈరోజు ఈ పరిస్థితి చూస్తున్నామని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఆన్లైన్ పేమెంట్స్ లో భారత్ ప్రపంచంలోకెల్లా ముందుందని అన్నారు ఎన్వీఎస్ రెడ్డి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# గ్యారెంటీ పే చర్చ...

ఎన్నికల్లో గెలిపిస్తే ప్రతి ఇంటికి కోటి రూపాయలు. ఒక్కసారి కాదు ప్రతి ఏటా కోటి రూపాయలు. ప్రతి ఇంటికి ఓ హెలికాప్టర్. కొత్త జంటకు బంగారు నగలు, మూడంతస్తుల బిల్డింగ్. ఆడవాళ్లకు వంటింటి పనిభారం తగ్గించేందుకు రోబోలు, కాల్వల్లో ఈదడానికి ప్రతి కుటుంబానికి ఓ పడవ. తమిళనాడు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన ఓ జర్నలిస్ట్ ఇచ్చిన హామీలు ఇవి. ఆపరేషన్ దుర్యోధన సినిమాలో.. హైదరాబాద్‌కు సముద్రాన్ని తెస్తానని హీరో ప్రామిస్ చేస్తే అంతా నవ్వుకున్నాం గానీ.. తమిళనాడులో నిజంగానే హామీలిచ్చాడు. ఇందులో.. ఎదుటివాళ్లు హామీలు ఇస్తున్నారు కదా అని ఓటు వేయొద్దని చెప్పడం ఒక ఉద్దేశం అయితే.. పార్టీల హామీలపై సెటైర్లు వేయడం మరో ఉద్దేశం. కలర్ టీవీలు, ఫ్యాన్లు, మిక్సీలు, ల్యాప్‌టాప్‌లు.. ఇలా ఎన్ని హామీలు ఇచ్చారో తమిళనాడులో. ఆ రాష్ట్రం సంగతేమో గానీ.. దేశవ్యాప్తంగా ఎన్నికల హామీలపై ఓ చర్చ అయితే జరుగుతోందిప్పుడు. కాంగ్రెస్ హామీలపై మోదీ చేసిన కామెంట్.. 'కాస్త చూసుకుని హామీలు ఇవ్వండంటూ' ఖర్గే చెప్పడం చూశాక.. 'గ్యారెంటీ పే చర్చ' నడుస్తోంది. గెలవడానికి హామీలు ఇవ్వడం, గెలిచాక చతికిలపడడం, ప్రజల్లో నమ్మకం కోల్పోవడం.. కొన్ని పార్టీలకు ఇప్పుడిప్పుడే తెలిసొస్తోంది అసలు విషయం. ఇంతకీ.. మోదీ ఎందుకని పర్టిక్యులర్‌గా తెలంగాణ, కర్నాటకను ఎగ్జాంపుల్‌గా చూపించారు? ఖర్గే ఎందుకని జాగ్రత్తపడ్డారు? బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై మరోసారి ఆలోచించుకుంటామని కర్నాటక ప్రభుత్వం ఎందుకంది? ఉచితాలపై ఇస్తున్న హామీల విషయంలో కాంగ్రెస్ మారాలి అంటున్నారాయన. సూపర్-5, సూపర్-6, సూపర్-10.. ఇలాంటి హామీలపై పునరాలోచించుకుందాం అన్నారు. ఎన్నికల సంఘం, సుప్రీంకోర్టు న్యాయమూర్తులతో సహా మేధావులు, ఆర్థిక నిపుణులు మొత్తుకుంటున్నది, హెచ్చరిస్తున్నది దీని గురించే. ఇంతకీ మల్లికార్జున ఖర్గే ఏమన్నారు? ఒక హామీ ఇచ్చే ముందు.. 'అది సాధ్యమా కాదా, ఖజానాలో డబ్బులు ఉన్నాయా లేవా, ఐదేళ్ల పాటు నడిపించగలమా లేదా' అనేది చూసుకోమంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేయాల్సినంత అవసరం రాకూడదు అంటున్నారు. గల్లా పెట్టెలో డబ్బుల్లేకపోయినా పథకాలు అమలుచేస్తే.. అది భవిష్యత్ తరాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ స్టేట్‌మెంట్‌లో ప్రతి అక్షరమూ నిజమే. మరో మాట కూడా అన్నారు మల్లికార్జున ఖర్గే. కనీసం రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ఇక పథకాలు అమలు చేసి ఏం లాభం అని. పథకాలు ఇచ్చుకుంటూ పోయి అభివృద్ధి చేయలేకపోతే ప్రజలు తిరగబడతారన్నారు. అదే జరిగితే.. భవిష్యత్ తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదంటూ హెచ్చరికలు చేశారు.కొందరు కామెంట్ చేయొచ్చు. 'ఏం.. హామీలు ఇచ్చే ముందు తెలియలేదా ఆ విషయం' అని. ఇప్పటికైనా ఆ మేల్కొలుపు మాటలు అంటున్నందుకు సంతోషించాలి గానీ కామెంట్ చేయనక్కర్లేదు. అంతా బాగానే ఉంది గానీ.. ఈ జ్ఞానోదయం వెనక కారణం ఏంటి? ఓవైపు మహారాష్ట్ర ఎన్నికల తేదీ దగ్గరపడుతున్న వేళ.. పథకాల విషయంలో ఈ వెనకడుగు ఏంటి? ఎందుకంటే.. కర్నాటకలో మహిళలకు కల్పిస్తున్న ఉచిత ప్రయాణం పథకాన్ని ఆపేయడమో లేదా పరిమితులు విధించడమో చేయబోతున్నారని ఓ ప్రచారం నడుస్తోంది. అది నిజమే అన్నట్టుగా.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా స్టేట్‌మెంట్ ఇచ్చారు. 'ఎస్.. ఉచిత బస్సుపై పునరాలోచనలో ఉన్నాం' అంటూ మాట్లాడారు. ఈ పథకాన్ని పూర్తిగా తీసేయకపోవచ్చు గానీ.. ప్రభుత్వంపై భారం తగ్గించుకునే ప్రయత్నం అయితే చేయొచ్చని చెబుతున్నారు. దీనిపై మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. 'ముందుగా హామీ ఇవ్వడం ఎందుకు, ఇప్పుడు వెనక్కి తగ్గడం ఎందుకు' అని ఖర్గే కామెంట్ చేసినట్టుగా చెబుతున్నారు.కాంగ్రెస్ చీఫ్ నుంచి ఈ మాట వచ్చిందో లేదో.. వెంటనే ఖర్గే వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు ప్రధాని మోదీ. 'అమలుచేయలేని హామీలు ఇవ్వడం సులభమే.. వాటిని అమలు చేయడం ఎంత కష్టమో ఇప్పుడిప్పుడే కాంగ్రెస్ గుర్తిస్తోంది' అంటూ ఎక్స్ వేదికగా కామెంట్ చేశారు. అక్కడితో ఆగలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో, అభివృద్ధి ఎలా కుంటుపడిందో చూడాలంటూ కామెంట్ చేశారు. వెంటనే.. మాజీ మంత్రి కేటీఆర్ కూడా అందుకున్నారు. గాలిమాటల గ్యారెంటీలతో మొదటికే మోసం వస్తుందన్న విషయం కాంగ్రెస్‌కు ఇప్పుడు అర్థమయిందా అంటూ విమర్శించారు. గ్యారెంటీల పేరుతో చేసిన మోసం క్షమించలేనిదంటూ ఫైర్ అయ్యారు. కర్నాటకలో ఐదు గ్యారెంటీలు ప్రకటించినప్పుడు, తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో వల వేసినప్పుడు బడ్జెట్ గురించి తెలియదా అంటూ నిలదీశారు కేటీఆర్. అఫ్‌కోర్స్ ఈ కామెంట్లకు కాంగ్రెస్ కౌంటర్ ఇచ్చిందనుకోండి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీ ఏమైందని ప్రధాని మోదీని ప్రశ్నించారు ఖర్గే. ప్రధాని మోదీ తెలంగాణ టాపిక్ తీసుకురావడంతో.. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి కూడా రియాక్ట్ అయ్యారు. ఉచిత బస్సు ప్రయాణంతో తెలంగాణ మహిళలకు 3,433 కోట్ల రూపాయలు ఆదా అయిందన్నారు. 18వేల కోట్ల రూపాయలతో దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల రూపాయల వరకు వైద్య సదుపాయం, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 50వేలకు పైగా ఉద్యోగ నియామకాలు, హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలు 40 శాతం పెంపు.. ఇలా ఏ బీజేపీ పాలిత రాష్ట్రాన్ని తీసుకున్నా.. తెలంగాణదే రికార్డ్ అంటూ కౌంటర్ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్.. ఇలా సంక్షేమంతో పాటు అభివృద్ధిలోనూ దూసుకుపోతున్నామని బదులు ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. 13 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిందంటూ ఓ వైపు టీడీపీ విమర్శించినా సరే..గత జగన్ ప్రభుత్వం మాత్రం పథకాలు పంచుతూనే వెళ్లింది. ఐదేళ్లలో 2 లక్షల 74 వేల కోట్ల రూపాయలు అక్కచెల్లెమ్మలకు నేరుగా పంచామని చెప్పుకున్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్. కాని, అన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా.. పోయిన ఎన్నికల్లో ఓట్లు వేయలేదు ఏపీ ప్రజలు. తెలంగాణలోనూ అదే జరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లోనే ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలయ్యాయి. కాని, పట్టణాల్లో ఎక్కువ సీట్లు వచ్చాయి.

# ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

## జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): వానకాలం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం లోని సమావేశ మందిరంలో జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తో కలిసి జిల్లా పౌరసరఫరాల సంస్థ మరియు శాఖ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై కొనుగోలు కేంద్రాల ఇంచార్జ్ లు, వ్యవసాయ, సహకార, డిఆర్డిఏ, తూనికలు కొలతలు రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు రైస్ మిల్లర్లతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ ఈ వానకాల సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు చెల్లించాలని ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తుందన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు తీసుకుంటున్న చర్యలను కొనుగోలు కేంద్రాల ఇన్చార్జ్ లను, వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తేమ పేరుతో రైతులను ఇబ్బందులు పెట్టవద్దనిఅధికారులకు సూచించారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని



అన్నారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని, ఏవైనా లోటుపాట్లు ఉంటే సరి చేసుకోవాలని అధికారులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 2,95,000 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా తో 165 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతన్న పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పనకు ఏ,బి గ్రేడ్ రకాలుగా విభజించి మద్దతు ధర ప్రకటించినట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యం 2320, బి గ్రేడ్ రకం 2300 రూపాయలుగా మద్దతు నిర్ణయించినట్లు చెప్పారు. ఎవరు ఎటువంటి ఒత్తిడికి తెచ్చినా నాణ్యతలేని ధాన్యం కొనుగోలు చేయవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు సూచించారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఓ పి ఎం ఎస్ లో ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవసరమైన గ్రైన్ కాలిపర్స్, టార్పాలిన్, తేమయంత్రాలు, వేయింగ్ యంత్రాలు, గన్ని బ్యాగులు తదితర సామాగ్రి అన్ని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనలు పాటిస్తూ రైతులకు సమాచారం అందించాలన్నారు. క్రాప్ట్ బుకింగ్ ప్రకారం సన్న ఓట్లు వేసిన రైతుల వివరాలు అందించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న ఒడ్లు, దొడ్డు వడ్లకు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్ని సంచులకు ట్యాగ్, సెంటర్ నెంబర్ వేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలన్నారు. రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లో తాలు కట్ చేయడానికి వీలు లేదని నాణ్యతను కొనుగోలు కేంద్రాల వద్దే పరిశీలించి పంపాలని సూచించారు. అనంతరం 2024 వానాకాలం సీజన్ ధాన్యం మద్దతు ధరకు సంబంధించిన గోడపత్రికను జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర కుమార్ ఐఏఎస్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, పౌరసరఫరాల శాఖ అధికారి రుక్మిణి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు,జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, జిసిసి అధికారిమరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందన్న మంత్రి

**- ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తాం**

**- అత్యుత్తమ నగరంగా వరంగల్ ను అభివృద్ధి చేస్తాం**

**- ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు**



వరంగల్ జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలోనే సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ లిమిటెడ్ వరంగల్ మామునూరు విమానాశ్రయం ఏర్పాటుకు అంగీకరించినట్లు మంత్రి సురేఖ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలోనే మామునూరు ఎయిర్ పోర్ట్ పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని అన్నారు. ఈ రోజు మర్రిచెన్నా రెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీఎం ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి లు వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి పై కూలంకషంగా చర్చించారు. మామునూరు ఎయిర్ పోర్టు, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు, ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్), అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాజీపేట రోడ్ ఓవర్ బ్రిడ్జ్, భద్రకాళి దేవాలయ మాఢవీధుల పనుల పురోగతి, భద్రకాళి చెరువు పూడికతీత, కూడా పరిధి విస్తరణ, జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ తదితర అంశాల మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, జిడబ్ల్యుఎంసి కమిషనర్ అశ్విని తానాజీ, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి సురేఖ మాట్లాడుతూ, వరంగల్ నగర పురోభివృద్ధి పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో వరంగల్ ప్రజల చిరకాల వాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్ట్ కు త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు మంత్రి సురేఖ తెలిపారు. ఇప్పటికే జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ప్యాసింజర్ సర్వీసులతో పాటు కార్గో సేవలు అందించే దిశగా మామునూరు ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసేలా ముఖ్యమంత్రితో చర్చిస్తామని మంత్రి సురేఖ చెప్పారు. ఇందుకు అవసరమైన భూసేకరణకు పై మంత్రులు చర్చించారు.కార్గో సర్వీసులు అందుబాటులోకి వస్తే కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ ఉత్పత్తుల రవాణాకు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తల రాకపోకలకు ఉపయుక్తంగా వుండి వరంగల్ నగర పురోగతి, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ఊతంగా నిలుస్తుందని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఏళ్ళుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తెచ్చి చేతల ప్రభుత్వంగా నిరూపించు కున్నదని మంత్రి సురేఖ తెలిపారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ప్లాన్ ను వేగంగా అమలుచేసేలా ప్రత్యేక అధికారిని నియమించాలని మంత్రి సురేఖ, వరంగల్ ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఎంఎయుడి ముఖ్య కార్యదర్శి దానకిషోర్‌ను ఆదేశించారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలనీ, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను నిర్దేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ పనులు కట్టుదిట్టంగా చేపట్టాలని, వీటికి అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులకు మార్గనిర్దశనం చేశారు. 41 కిలోమీటర్ల వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మొదటి దశలో 20 కి.మీలు, రెండవ దశలో 10 కి.మీలు, మూడవ దశలో 9 కి.మీల రోడ్డు పనులు చేపట్టేలా ప్రణాళికను అమలు చేయాలని మంత్రులు సూచించారు. ఇందుకు 911 ఎకరాల భూసేకరణ చేయాల్సి వుందని అధికారులు తెలిపారు. భద్రకాళీ దేవాలయానికి అనుబంధంగా వున్న భద్రకాళి చెరువు పూడికతీత పనులను వెనువెంటనే ప్రారంభించాలని మంత్రులు అధికారులకు సూచించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డిపిఆర్‌ను వెంటనే సిద్ధం చేసి,వేగంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ నెలలో కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# సరైన తేమ శాతం గల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ములుగు జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): సరైన తేమ శాతం (17శాతం కన్నా తక్కువ) తో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టీ. వినయ్ క్రిష్ణారెడ్డి ఐఏఎస్ అన్నారు. మంగళవారం ఖరీఫ్ 2024 - 25 సీజన్ కి సంబంధించిన ధాన్యం కొనుగోలులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన టీ. వినయ్ కృష్ణారెడ్డి ములుగు జిల్లాలోని చాల్వాయి పి.ఎ.సి.ఎస్. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఏర్పాటు చేయవలసిన త్రాగు నీరు, టాయిలెట్లు మరియు ఇతర సదుపాయాలపై మరియు రైతుల నుండి ధాన్యం కొనుగోలు మరియు ధాన్యం డబ్బుల చెల్లింపులు మొదలైన వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. దొడ్డు రకం, సన్నరకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని గన్ని బ్యాగులలో తూకం వేసే కుప్పలన్నింటిని ఆరబెట్టి పంపించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి వినయ్ క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కు సంబంధించి జిల్లా అధికారులకు పలు సలహాలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలులో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని ఎఫ్ ఏ క్యూ ప్రమాణాలను పాటించి ధాన్యం కొనుగోలు చేయాలని ధాన్యం కొనుగోలుకి సంబంధించి



గన్ని బస్తాలు పంపించడం, ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేయడం మరియు సన్న దాన్యానికి బోనస్ చెల్లింపులు మొదలగు చర్యల గురించి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం జిల్లాకు విచ్చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్మెంట్ కమిషనర్ టీ. వినయ్ క్రిష్ణారెడ్డి ఐఏఎస్ కు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పూల మొక్కను అందచేసి స్వాగతం పలికారు. వారితో సమావేశమై ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ధాన్యం అన్లోడ్ సమస్యలు, హమాలీలు, లారీల సమస్యల పై కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమములో ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మహేందర్ జి, డి సి ఎస్ ఓ షా ఫైజుల్ హుస్సేనీ, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాం పతి , డి సి ఓ సర్దార్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలి

పరకాల, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): హన్మకొండ జిల్లా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారము మంగళవారం పరకాల మున్సిపల్ పరిధిలోని 6వ, 7వ, 20వ వార్డులలో ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కుల జనగణ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయవలసిందిగా పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ అన్నారు. వారు మాట్లాడుతూ ఈ యొక్క కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని, ప్రజలందరికీ సమాన హక్కులను అందేటట్టుగా ప్రభుత్వ పథకాలు అందరికీ అందేటట్లుగా ఈ కార్యక్రమం తోడ్పడుతుందని ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం



చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో 6,7,20 ఈ మూడు వార్డులలో 7వ వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు,అభిమానులు,వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# తండ్రికొడుకు ప్రాణం తీసిన మంచం



సేలం: ఇనుప మంచం పడి తండ్రి, కుమారుడు మృతి చెందిన ఘటన దిండుగల్ లో ఆదివారం వేకువజా మున చోటు చేసుకుంది. దిండుగల్ సమీపంలో ఉన్న సానర్‌పట్టి కాలియమ్మన్ కోవిల్ వీధికి చెందిన గోపీకన్నన్ (35) టైలర్‌గా పని చేస్తున్నాడు. ఇతని భార్య యోగేశ్వరి (32) నత్తం ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తుంది. వీరికి కుమారుడు కార్తిక్ (10) ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం రాత్రి యోగేశ్వరి పనికి వెళ్లడంతో ఇంట్లో గోపీకన్నన్ మద్యం మత్తులో ఇనుప మంచంపై పడుకుని నిద్రపోయాడు. అతని పక్కన నేలపై కార్తిక్ పడుకున్నాడు. ఈ స్థితిలో వేకువజామున ఇనుప మంచం బోల్టు ఊడి కింద పడింది. దీంతో మంచం మధ్యలో తల చిక్కుకుని గోపికన్నన్ కింద పడుకుని ఉన్న కుమారుడు కార్తిక్‌పై పడ్డాడు. దీంతో తండ్రీ, కొడుకులు మృతి చెందారు. సోమవారం తెల్లవారుజామున లోగేశ్వరి తన భర్త, కుమారుడిని తనిఖీ చేసేందుకు వెళ్లింది.

విరిగిన ఇనుప మంచంలో తన భర్త, కొడుకు చనిపోయి పడి ఉండటాన్ని ఆమె గుర్తించింది. ఆమెతో పాటు ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. సానర్‌పట్టి పోలీసులు కేసు నమోదు చేశారు

# జిల్లాలో కలెక్టర్ విస్తృతంగా పర్యటన

మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): మంగళవారం జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. మరిపెడ మండలం చిల్లంచెర్ల, రాంపూర్, దంతాలపల్లి, పెద్దముప్పారం, పెద్ద వంగర, లలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పెద్ద వంగర అంగన్వాడీ కేంద్రాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, కేంద్రాలలో మౌలిక వసతులు త్రాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, సౌకర్యాలు కల్పించాలని, సన్నరకం, దొడ్డ రకం, కేంద్రాలలో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ కొనుగోలు చేపట్టాలని, రైతు యొక్క ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, తదితర అంశాలను ఆన్లైన్లో వెంటనే నమోదు చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు మ్యచ్చుర్, వచ్చే విధంగా ఎలా చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించాలన్నారు, ప్రభుత్వ సూచనల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సెంటర్ నిర్వాహకులు నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, రైస్ మిల్లర్లు సహకరించాలని, జిల్లా వ్యాప్తంగా (226) కేంద్రాలు కొనసాగుతున్నాయని. పెద్దవంగర అంగన్వాడి కేంద్రాన్ని



తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పోషక ఆహార వివరాలు అడిగి తెలుసుకున్నారు, శ్యామ్, మ్యామ్, పిల్లల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మధుసూదన్ రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డి ఎస్ ఓ ప్రేమ్ కుమార్, సెంటర్ నిర్వాహకులు సంబంధిత తహసీల్దారులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజానికి, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): ఈనెల 18 19 20 తేదీలలో అన్నపురెడ్డిపల్లిలో జరిగే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థిని విద్యార్థులు సమాజానికి, రైతులకు ఉపయోగపడే ప్రాజెక్టులు రూపొందించేటట్లుగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన పై జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులకు పాత కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వైజ్ఞానిక ప్రదర్శన కేవలం అలంకరణ కోసం కాకుండా దాని ద్వారా విద్యార్థులు గుణాత్మకమైన వ్యవసాయ వేత్తలుగా, శాస్త్రవేత్తలుగా తయారయ్యే టట్లుగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి మంచి ప్రాజెక్టుల రూపొందించాలని సూచించారు. వైజ్ఞానిక ప్రదర్శనలోని ఉప అంశాలైన ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత, గణిత నమూనాలు, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ, సహజ వ్యవసాయం, రవాణా మరియు సమాచార వ్యవస్థ, విపత్తు నిర్వహణ అనే అంశాలను వివరిస్తూ వాటిలో ఎటువంటి ప్రాజెక్టులు రూపకల్పన చేయవచ్చు అనే అంశాలను విశదీకరించారు. అంతేగాక జిల్లాలో ప్రత్యేకంగా చేపట్టిన మునగ సాగు, వర్షపునీటి గుంటల తయారీ, అలాగే సాంప్రదాయ నిర్మాణ పద్ధతులు వంటి వాటి గురించి వివరిస్తూ వీటిలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఆలోచనత్మకమైన ప్రాజెక్టులను తయారుచేసి విద్యార్థిని విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేటట్లుగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం. వెంకటేశ్వర చారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజ శేఖర్, జిల్లా






సైన్స్ అధికారి ఎస్. చలపతి రాజు, రిసోర్స్ పర్సన్ లు సంపత్ కుమార్, చంద్రశేఖర్, తో పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల నుండి సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్ధవంతంగా నిర్వహించాలి

**– దొడ్డు, సన్నరకం ధాన్యం వేరు వేరుగా కొనుగోళ్లు చేపట్టాలి**

జనగామ జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణపై ఐకెపి, పిఎసిఎస్ నిర్వాహకులకు సంబంధిత అధికారులతో జూమ్ మీటింగ్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల కేంద్రాలను పర్యవేక్షించాలని, ఓ.పి.ఎం.ఎస్. ఎంట్రీ చేయడంలో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లపై దృష్టి పెట్టినందున కొనుగోళ్ళు కేంద్రాలలో సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ ఇంచార్జ్ లు కేంద్రాలలోనే ఉండాలని, కేంద్రానికి తెచ్చిన ధాన్యం రైతు విక్రయించేంత వరకు బాధ్యత తీసుకోవాలన్నారు. తేమ శాతం రాని ధాన్యం మాయిశ్చరైజ్ వచ్చేవరకు ఆరబెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని, వర్షాలకు తడవకుండా రక్షణ కల్పించేందుకు టార్పాలిన్లు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యం దొడ్డు, సన్నరకం తేమశాతం వివరాలను రిజిస్టర్ లో ముందుగా



వేరు వేరుగా పెట్టుకొని నమోదు చేయాలన్నారు. దొడ్డురకం, సన్నరకం ధాన్యం వేరు వేరుగా కనిపించేలా మార్కింగ్ చేసుకోవాలన్నారు. సన్నరకం ధాన్యం కు ప్రభుత్వం ప్రత్యేకంగా 500 రూ.లు.బోనస్ ప్రకటించినట్లు ప్రతి రైతుకు తెలియపరచాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం తగదు అన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, జనగామ, స్టేషన్ఘన్పూర్ ఆర్డీవోలు గోపి రామ్, డిఎస్ వెంకన్న, డి. ఆర్. డి. ఏ. పిడి వసంత, తాసిల్దార్లు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# దాన్యం కొనుగోలులో సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉండాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): దాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మొగుళ్లపల్లి మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లాకు



విచ్చేసిన ప్రత్యేక అధికారికి జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, పౌర సరఫరాల సంస్థ డిఎం రాములు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా జిల్లాలో కొనుగోళ్లు చేపట్టాలని, దాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. దాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరును పరిశీలించి, ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సన్న, దొడ్డు రకం దాన్యం బస్తాలు విడివిడిగా భద్ర పరచాలని, రకాలు గుర్తించడానికి వీలుగా చేరిగిపోకుండా గుర్తులు వేయాలని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన దాన్యం ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేసేందుకు, రవాణాకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మిల్లర్లు దాన్యం దిగుమతికి జాప్యం జరుగకుండా హమాలీలను సిద్ధంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి మన జిల్లాకు దాన్యం రాకుండా సరిహద్దులో చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ఠ నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఏ సీఎస్ చైర్మన్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# చేప పిల్లల పంపిణీలో కిరికిరి

**– మూడు నెలలు ఆలస్యంగా సీడ్ పంపిణీ**

**– ప్రభుత్వం చెప్పింది 50శాతం దానికంటే తక్కువ సీడు**

**– చేపల ఎదుగుదల ఉండదని మత్స్యకారుల వాదన**

**– వెనక్కి పంపి నిరసన తెలిపిన మత్స్యకారులు**



భూపాలపల్లి, నవంబర్ 5 (తీన్మార్ న్యూస్): తెలంగాణ గళం ప్రతినిధి: గణపురం మండల పరిధిలోని 67 చెరువులు మరియు గుంటలకు మూడు రకాల చేప పిల్లల సీడును పంపిణీ చేయాల్సి ఉండగా ఒక రకం మాత్రమే సంబంధిత కాంట్రాక్టర్ తీసుకురావడం వల్ల మండల పరిధిలోని మత్స్యకారులు అందరూ నిరసన తెలిపి మాకు వద్దని మూడు వాహనాలను తిరిగి పంపించారు. మొత్తం 25 లక్షల పిల్లలు 35-40%ఎఎ%, 30 లక్షలు 80-100%ఎఎ% రావాల్సి ఉండగా అంతకంటే తక్కువ సైజు పిల్లల్ని తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీలో ప్రభుత్వం చెప్పిన విధంగా కాకుండా కోత విధించడం సరికాదని కాంట్రాక్టర్ కు హెచ్చరించారు. చెరువుల్లో కుంటల్లో వేయడానికి ప్రభుత్వం చెప్పిన దానికంటే తక్కువ చేసి ఇవ్వడం సరికాదన్నారు. టార్గెట్లో సగం చేపలు పెంచి వారికి ఉపాధి కల్పించాలని అధికారులు సీడ్ సప్లై చేయగా ఇప్పుడు సీడ్ వేసి ప్రయోజనం లేదని మత్స్యకార సంఘ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ చాడ కృష్ణస్వామి ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా ఉపాధ్యక్షులు జోడు ప్రదీప్ ముదిరాజ్ మండల అధ్యక్షులు బోయిని సాంబయ్య ముదిరాజ్ మత్స్యశాఖ చైర్మన్లు నీరటి రాజమల్లు,ఆకుల రాజయ్య,కట్ల మల్లయ్య డైరెక్టర్లు మునగాల రమేష్,పల్లె వేణి కృష్ణంరాజు,కొంతం సంజీవ,కీసరి రవి,అల్లం స్వామి,పల్లెవేణి రవీందర్,మల్లవేని సారంగంలి తదితరులు పాల్గొన్నారు. జిల్లా అధికారి అవినాష్ మాట్లాడుతూ సీడ్ పంపిణీలో కొంత జాప్యం జరిగిన విషయం నిజమే. దీనికి కారణాలు మత్స్య సంఘాలకు తెలుసు నవంబర్ 15 లోగా చేప పిల్లల పంపిణీ ముగిస్తాం చేపలు పెరగవని అపోహలు వద్దు రోజుకు ఒక ఎంఎం చొప్పున పిల్లలు పెరిగి ఎనిమిది నెలల్లో కిలో బరువు తూగుతాయి ట్రాన్స్పరెంట్ నీటిలో మాత్రమే ఫిష్ సీడ్ పెరగదు జిల్లాల్లో బ్లాక్ సాయిల్ పొటెన్షియల్ జలేషాలే ఉన్నాయి. పక్క పెరుగుతాయి అనుమానాలు పెట్టుకోవద్దు అని అన్నారు.

# ఎస్సి, ఎస్టి కేసులలో న్యాయం జరిగే విధంగా కృషి చేస్తాం

**– జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి**

హనుమకొండ జిల్లా, నవంబర్ 5 (తీన్మార్ న్యూస్): జిల్లా పరిధిలో నమోదైన ఎస్సి, ఎస్టి కేసులలో చట్ట ప్రకారం న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎ. వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎస్సి ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎస్సి ఎస్టీ కేసుల నమోదు వివరాలు, వాటి పురోగతి, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై కమిటీ సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎస్సి ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామ న్నారు. మానిటరింగ్ సభ్యులకు గుర్తింపు కార్డు లను అందజేస్తామన్నారు. మహనీయుల జయంతి కార్యక్రమాలను జిల్లా కలెక్టరేట్ లో నిర్వహిస్తామన్నారు. కమిటీ సమావేశంలో చర్చించిన అన్ని అంశాలను, సమస్యలు జిల్లా కలెక్టర్ దృష్టి కి తీసుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సి, ఎస్టీ విజిలెన్స్,




మానిటరింగ్ కమిటీ సభ్యులు పుట్ట రవి, చుంచు రాజేందర్, హరి జవహర్ లాల్ నాయక్, రడపాక పరంజ్యోతి, సింగారపు రవిప్రసాద్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్, ఓయాసిస్ సంస్థ ప్రతినిధి ప్రకాష్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, ఏసీపీలు కిషోర్ కుమార్, తిరుమల్, దేవేందర్ రెడ్డి, ఎస్సి సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, తహసీల్దార్లు జ్యోతివరలక్ష్మి దేవి, బావ్ సింగ్, చల్లా ప్రసాద్, సదానందం, జగన్ మోహన్ రెడ్డి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# 2050- విజన్‌తో వరంగల్ మాస్టర్ ప్లాన్ సిద్ధం

**– యుద్ధప్రాతిపదికన వరంగల్ ఎయిర్ పోర్ట్ పనులు**

**–వరంగల్ అభివృద్ధిపై విస్తృత స్థాయి సమావేశం**

**– పాల్గొన్న వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి**



హన్మకొండ జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): గొప్ప చారిత్రిక నేపథ్యం ఉన్న వరంగల్ నగర అభివృద్ధికి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మాస్టర్ ప్లాన్‌ను విడుదల చేస్తారని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలు, వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్ .సి. హెచ్ .ఆర్.డీ లో వరంగల్, హన్మకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్ , వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి టెంపుల్ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి ధీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి పరచాలన్న కృతనిశ్చయంతో వరంగల్ నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందని అన్నారు. అభివృద్ధి పనుల వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని మొదటి దశలో 20 కిలో మీటర్లు, రెండవ దశలో 11 కిలోమీటర్లు, మూడవ దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ రాబోతోందని, వీలైనంత త్వరగా ఎయిర్‌పోర్ట్ పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను రేపటినుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండ చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్దానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, శాసనసభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.నాగరాజు, నాయిని రాజేందర్ , ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి, సిఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఎం.ఎ.యూ.డి. ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, రోడ్లు, భవనాల కార్యదర్శి హరిచందన, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సత్యశారద, పి. ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల కేసునకు హాజరైన మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్

హన్మకొండ, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): 2023 నవంబర్ - డిసెంబర్ నెలలో జరిగిన సాధారణ ఎన్నికలు (అసెంబ్లీ) సందర్భంగా నమోదైన కేసు విచారణ మంగళవారం రోజున హైదరాబాద్‌లో సిటీ సివిల్ కోర్టులో (స్పెషల్ పొలిటికల్ కేసెస్) జరిగింది. ఈ నేపథ్యంలో విచారణకు మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ గారు వెస్ట్ కన్వీనర్ తాళ్ల పెల్లి జనార్ధన్ గౌడ్, వీరి తరపున %ఎతీం% లీగల్ సెల్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్, సీనియర్ న్యాయవాది అజయ్, ఉపాధ్యక్షులు శ్రీరామ్ కిరణ్ కుమార్, వేణు పటేల్ జానకి రామ్ పాల్గొనడం జరిగింది



# ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలి

**– జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు 6, 7 తేదీల్లో ఇండ్ల జాభితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం నుండి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, సూపర్ వైజర్లుతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీల్లో గ్రామ, మున్సిపాలిటీ లో ఇంటింటి జాభితా ప్రారంభం చేయాలని తెలిపారు. రెండు రోజుల్లో ఇంటింటి జాభితా గణనలో ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని, సర్వే పూర్తి అయిన తదుపరి మార్కర్ పెన్ తో తేదీ వేయాలని సూచించారు. 8వ తేదీ నుండి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలని తెలిపారు. ఈ ప్రక్రియ 15రోజుల్లో పూర్తి చేయుటకు పభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో 12 మండలాలు, భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో కలిపి 1,31,030 ఇండ్లు సర్వే నిర్వహణకు 993 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 842 మంది, పట్టణ ప్రాంతంలో 92 మందితో కలిపి మొత్తం 934 మంది ఎన్యూమరేటర్లను నియమించామని, రీజర్వ్ లో 109 మందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాలకు 92 మంది, పట్టణ ప్రాంతానికి 9 మంది, రిజర్వడ్ లో 22 మంది మొత్తం 123 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లగా పీఎస్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, విఓఎస్ లను నియమించినట్లు తెలిపారు. సర్వే పూర్తయిన ప్రతీ ఇంటికి అంటించిన స్టిక్కర్ లో చెరిగిపోకుండా మార్కర్ పెన్ తో తేదీలు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహణకు జిల్లాలో ఇండ్లను గుర్తించి సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. 6వ తేదీ నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి ఇంటింటి జాభితా సర్వే చేయనున్నట్లు తెలిపారు. గణనకు 150 ఇళ్లను ఒక ఎన్యూమరేషన్ బ్లాక్ గా తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఒక్కొక్కరు రోజుకు కనీసం పది ఇళ్ల చొప్పున పదిహేను రోజుల్లో 150 ఇళ్ల సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. ఈబీలను పరిగణనలోకి తీసుకున్నామని, అయితే, జనాభా పెరిగినందున ఎన్యూమరేషన్ బ్లాక్ లో 150 కు మించి ఇళు ఉంటే 150 ఇళ్లకు ఒకరు, పైబడిన ఇళ్లకు అదనంగా ఒక ఎన్యూమరేటర్ ను నియమించినట్లు తెలిపారు. సర్వేపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రోజుకు పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో ఎన్యూమరేషన్ పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించామని, ఎన్యూమరేటర్లకు స్టేషనరీతో కూడిన కిట్ ఇస్తున్నామని తెలిపారు. సర్వేకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను నియమించామని అట్టి ఉపాధ్యాయులు ఒక పూట పాఠశాలకు వెళ్లి మధ్యాహ్న భోజనం అనంతరం సర్వేలో పాల్గొనాలని సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో జిల్లాలోని అన్ని ఇళ్లను సర్వే చేయనున్నట్లు తెలిపారు. ఏ రోజుకారోజు వివరాలను ఆన్లైన్ చేయడానికి డేటా ఎంట్రీ సిబ్బందిని నియమించాలని అన్నారు. సర్వే చేసే ప్రాంతాల్లో ఒక రోజు ముందుగానే విస్తృత సమాచారం ఇచ్చి ప్రజలు సర్వేకు అవసరమైన అన్ని పత్రాలు అందుబాటులో ఉంచుకునేలా అవగాహన కల్పించాలని తద్వారా నిర్దేశిత సమయంలో సర్వే పూర్తవుతుందని తెలిపారు. కాటారంనకు సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లికి ఆర్డిఓ మంగిలాల్ నోడల్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను నియమించినట్లు తెలిపారు. ఇంటింటి జాభితా సేకరణ, సర్వే ప్రక్రియ నిర్వహణను డివిజన్ నోడల్ అధికారు లు, మండల ప్రత్యేక అధికారులు, సూపర్ వైజర్లు, కోర్ టీమ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సిపిఓ బాబూరావు, డిపిఓ నారాయణ రావు, ఆర్డిఓ మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు: కలెక్టర్



ధర్మారం : రైతులవద్ద నుంచి మద్దతు ధరపై పూర్తి స్థాయిలో వారి ధాన్యం కొనుగోలు చేస్తామని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వీస్తృతంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తరలింపుకు ఇబ్బందులు లేకుండా వాహనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చే రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని దొంగతుర్తి, ధర్మారం, మల్లాపూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల ఇంచార్జి అధికారులు రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరపై వేగవంతంగా కొనుగోలు చేసే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ అధికారులు కోతల సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, హార్వెస్టర్ల వినియోగంలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలు విస్తృతంగా ప్రచారం చేయాలని, రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వచ్చే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత వెంటనే సంబంధిత మిల్లులకు లేదా గోదాములకు తరలించాలని, ధాన్యం తరలింపులో ఎక్కడ వాహనాల కొరత రాకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా సహకార అధికారి శ్రీమాల, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జిలు, సంబంధిత అధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి

**– వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేత..**



వేములవాడ: వరి ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలి అని వేములవాడ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు, 20వ వార్డు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకపోవడం చాలా బాధాకరమైన విషయం అని మండిపడ్డారు. రైతులు వరి కోతలు మొదలు పెట్టి దాదాపుగా నెల రోజులు గడుస్తా ఉన్న ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తా ఉంది అని తెలిపారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున కళ్ళల్లో పోసిన ధాన్యంపై రైతులు ఆవేదన చెందుతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు రైతులు గురవుతున్నారు. కావున వెంటనే కొనుగోలు కేంద్రాలను ఎక్కువ మొత్తంలో ఏర్పాటు చేసి భేషరతుగా తడిచిన ధాన్యాన్ని ఎలాంటి తాలూ, తప్ప ,తరగు లేకుండా వడ్ల కొనుగోలు వెంటనే చేపట్టాలని బీజేపీ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. రైతులకు కళ్ళాలల్లో ఉన్నటువంటి వడ్లకు సరిపడా టార్పలిన్ కవర్లు అందజేయాలని ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ. 500 బోనస్ అని చెప్పి ఇప్పుడు కేవలం సన్నవడ్లకు మాత్రమే అని చెప్పడం ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ చెల్లించాలని అదేవిధంగా పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేసి ఇప్పటివరకు చెల్లించనటువంటి రైతుబంధును వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన రైతులకు రైతు పండించిన పంటకు చాలా ఉపయోగకరమైన పథకం కాబట్టి వెంటనే తెలంగాణ రాష్ట్రంలో ఫసల్ భీమా యోజన అమలు చేయాలని కోరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు వేములవాడ భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ పక్షాన స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది అని వెల్లడించారు. కార్యక్రమంలో పిన్నింటి హనుమన్లు, గుడిసె మనోజ్, రేగుల రాజకుమార్, నామాల శేఖర్, బిల్లా కృష్ణ, రేగుల శ్రీకాంత్, మామిళ్ళ లక్ష్మీరాజం, ఖమ్మం పృథ్వీరాజ్, సగ్గు రాహుల్, కొరెపు వెంకటేష్, రంజిత్ రెడ్డి, నగేష్ యాదవ్ బిజెపి కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): బుధవారం జిల్లాల్లోని వివిధ గ్రామాల్లో పర్యటించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. బి. దిలీప్ కుమార్, డా. యూ. నాగభూషణం, డా. ఆర్. విశ్వతేజ మరియు జిల్లా వ్యవసాయ అధికారి శ విజయ్ భాస్కర్ వరి పొలాలను, ప్రత్తి చేనులను మరియు మిర్చి తోటలను సందర్శించారు. ప్రత్తిలో రసం పీల్చు పురుగుల అధికంగా ఉన్నట్లు గుర్తించి, వాటి నివారణకు డాఫెంతయిరాన్ అనే మందును 1.25 గ్రాములు లేదా అసిఫేట్ 1.5 గ్రా లీటర్ నీరు చొప్పున కలిపి పిచికారి చేసుకుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం మిర్చి తోటలో తామర పురుగు గమనించి వీటి నివారణకు ఫిప్రోనీల్ 2 ml లేదా స్పినోసాడ్ 0.3 ml లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అలాగే ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వరి నూతన చిరుసంచి వంగడాలను రైతు పొల్లాలో పరీక్షించి వాటి పనితనాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో మండల వ్యవసాయ అధికారులు వాసుదేవ రెడ్డి, ఐలయ్య, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇండ్లు

**– మొదటి విడతలో ఇచ్చేందుకు నిర్ణయం**
**– రెండో విడత రేషన్‌కార్డు ఉంటేనే అర్హులు**
**– నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించడమే లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



ఖమ్మం: అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదని, రేషన్‌కార్డు లేకపోయినా మొదటి విడతలో పేదలు, నిరుపేదలు.. ఇలా కేటగిరీల వారీగా పరిశీలించి ఇండ్లు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నామని రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ఖమ్మంలోని 59వ డివిజన్ దానవాయిగూడెంలో పర్యటించి రూ. 25 లక్షల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ కాల్వల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. త్వరలోనే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుందని, రెండో విడత నుంచి రేషన్‌కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇండ్లు పొందేందుకు అర్హులవుతారని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణలోని పది జిల్లాల పరిధిలో 19.56 లక్షల ఇండ్లను వైఎస్ఆర్ చేతుల మీదుగా పేదలకు కట్టిచ్చామని గుర్తుచేశారు. ఇందిరమ్మ ఇండ్లను మహిళల పేరిట మంజూరు చేస్తామని, 400 చదరపు అడుగులతో ఇల్లు నిర్మిస్తామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు గ్రీన్ ఛానల్ ద్వారా నాలుగు దశల్లో నిధులు విడుదల చేస్తామని తెలిపారు. పునాది వేసినప్పుడు రూ. లక్ష, లెంటల్ లెవెల్‌లో రూ. 1.25లక్షలు, స్లాబ్ దగ్గర రూ. 1.75లక్షలు, గృహప్రవేశం సమయానికి మరో లక్ష లబ్దిదారులకు నేరుగా అందించనున్నట్లు చెప్పారు. ఈనెల 20 తర్వాత గ్రామసభల ద్వారా ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాబోయే నాలుగేండ్లలో 20 లక్షల ఇండ్లకు తగ్గకుండా నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. సాంకేతికతను వినియోగిస్తూ ప్రత్యేక యాప్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని పర్యవేక్షిస్తామని తెలిపారు. అలాగే, గతంలో ప్రారంభించి పూర్తి కాని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి కరెంటు, తాగునీరు, వంటి మౌలిక వసతులు కల్పించి లబ్దిదారులకు కేటాయిస్తామని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగానే నివాసం ఉండాలని, పనిలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, మున్సిపల్ కార్పొరేషన్ ఈఈ కృష్ణలాల్, డీఈ మాధవి దేవి, ఏఈ కుమారస్వామి, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో సరళ స్కానింగ్ సెంటర్ను తనిఖీ చేసిన జిల్లా ఉప వైద్య అధికారి




ములుగు, నవంబర్ 05 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశానుసారము మంగళవారం జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్ జిల్లా మాత శిశు సంరక్షణ మరియు పోషకాహార ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ ల బృందం గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ ప్రక్రియ చట్ట1994 ప్రకారం ములుగులోని సరళ స్కానింగ్ సెంటర్ను తనిఖీ చేశారు. సరళ స్కానింగ్ సెంటర్ లోనే రికార్డులను పరిశీలించారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, ఫైర్ సర్టిఫికెట్, ధరల పట్టిక మరియు డాక్టర్ల వివరాలు డిస్ప్లే చేయవలసిన లోపాలను గమనించి ,సరళ స్కానింగ్ మేనేజ్మెంట్కు నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్, మాత శిశు సంరక్షణ మరియు పోషకాహార జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్ డెమో సంపత్ మరియు ఏమో దుర్గారావు పాల్గొన్నారు.

# గెజిట్ మేరకు సర్టిఫికెట్లలో పేరు మార్పు : హైకోర్టు



హైదరాబాద్: గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం పిటిషనర్‌కు చెందిన విద్యాపరమైన సర్టిఫికెట్లలో పేరు మార్పు రెండు వారాల్లోగా చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. తన పేరు మార్చుకున్నట్టు గెజిట్ జారీ అయినప్పటికీ ఎస్ఎస్‌సీ, ఇంటర్ బోర్డు, ఉస్మానియా యూనివర్సిటీ సర్టిఫికెట్లలో పేరు మార్పు చేయలేదంటూ హయత్‌నగర్‌కు చెందిన వి మధుసూదన్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. 1961లో జారీ చేసిన జీవో నెంబర్ 1263లో పేరు మార్పునకు వీలు లేకపోవడం అన్యాయమని తెలిపారు. పిటిషనర్ విజ్ఞప్తికి ప్రభుత్వం అంగీకారం చెప్పినందున పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె శ్రీనివాస్‌రావు డివిజన్ బెంచ్ ఇటీవల ప్రకటించింది.

**మార్గదర్శి కేసు 7కి వాయిదా**

తమ సంస్థ మార్గదర్శి ఫైనాన్సియర్స్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఇతరులు మీడియాతో మాట్లాడకుండా ఉత్తర్వులు ఇవ్వాలన్న ఆ సంస్థ అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. మీడియాతో మాట్లాడకుండా ఆర్డర్ ఇవ్వాలని మార్గదర్శి ఫైనాన్సియర్స్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా సోమవారం హైకోర్టును కోరారు. తమ ముందున్న పిటిషన్‌పై విచారణ చేపట్టకుండానే ఉత్తర్వులు ఇవ్వబోమని హైకోర్టు స్పష్టం చేసింది. లూథ్రా వినతిపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అభ్యంతరం చెప్పారు. సుప్రీంకోర్టు సూచన మేరకు హైకోర్టులో కేసు విచారణలో సహకారం మాత్రమే అందిస్తున్నట్టు వివరించారు. ఎవరి తరఫున వకాల్తా తీసుకుని వాదించడం లేదన్నారు. రూల్స్‌కు విరుద్ధంగా మార్గదర్శి డిపాజిట్లను సేకరించిందనే కేసు తదుపరి విచారణను ఈనెల ఏడో తేదీకి వాయిదా వేసింది.

# సన్నాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



గోవిందరావుపేట: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీ ప్రకారం 33 రకాల సన్నధాన్యాన్ని ఎలాంటి కొత్త ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం పస్రా గ్రామంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్ అసోసియేషన్లు సన్నధాన్యాన్ని మిల్లింగ్ చేయలేమంటూ ప్రభుత్వ అధికారులు, కలెక్టర్లకు వినతిపత్రాలు ఇచ్చిన నేపథ్యంలో ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి నిల్వ చేయాలని కోరారు. సన్న ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేక మిషన్లను ఏర్పాటు చేసి పరిశీలించి కొంటామని చెప్పడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. సాకులతో ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదా తప్పుకోవడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్టు ఉందని విమర్శించారు. ఖరీదులో ఎక్కడ తేడా వచ్చిన రైతాంగాన్ని సమీకరించి ఆందోళనలు చేస్తారని హెచ్చరించారు. రూ. 2లక్షల రుణమాఫీలోనూ ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్నారు. రేషన్ కార్డు, ఇతర నిబంధనల పేరుతో లక్షల్లోపు వారికీ, రెండు లక్షలపై ఉన్న వారికి రుణమాఫీ వర్తించలేదని, పై డబ్బులు చెల్లిస్తే వర్తిస్తుందంటే రైతు ఎక్కడ నుంచి తెచ్చి కడతాడని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను సక్రమంగా అమలు చేయలేకపోయిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు కాంగ్రెస్ కమిటీలుగా మారడంతో పారదర్శకత లోపించిందని ఆరోపించారు. అఖిలపక్ష కమిటీలను ఏర్పాటు చేసి పంచాయతీ సభల ద్వారా నిజమైన లబ్దిదారులను ఎంపిక చేస్తే అర్హులైన వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోడు భూములకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయిందని, దాంతో గిరిజనులు సకాలంలో వ్యవసాయం చేసుకోలేక, రుణాలు రాక, పంట వేయక నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పోడు భూములపై విధివిధానాలను రూపొందించి పోడు రైతాంగానికి న్యాయం చేయాలని అన్నారు. గోదావరి ప్రవహిస్తున్న ఈ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఒక్క చెరువు కూడా గోదావరితో నిండకపోవడం ఆశ్చర్యకరమని అన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పారదర్శకంగా ఉండాలని తెలిపారు. సర్వేలోని ప్రశ్నల్లో కుటుంబ రాజకీయ స్థితిని ప్రశ్నించడం సరికాదన్నారు.

# శ్రీనివాస గౌడ్ కు వరుస కష్టాలు



మహబూబ్ నగర్: వరుస కష్టాలతో మాజీమంత్రి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారట. కష్టకాలాన్ని ఎదుర్కోలేక.. బయట చెప్పుకోలేక సతమతం అవుతున్నారు. పదేళ్ల పాటు భరించిన మహబూబ్ నగర్ జనం.. గత ఎన్నికల్లో ఆయనకు మెండిచేయి చూపించారని నియోజకవర్గంతో పాటు పొలిటికల్ టాక్ నడుస్తోంది. ఇంతకాలం భరించి..అణచివేతకు గురైన వారంతా ఒక్కటై శ్రీనివాస్ గౌడ్‌ను ఓడించారని వార్తలు అప్పట్లో వినిపించాయి. ఓడలు బళ్లు.. బళ్లు ఓడలౌతాయంటే ఇదేనేమో. మొన్నటి వరకూ.. ఎవరక్కడ.. అంటూ అధికారం చెలాయించిన మాజీమంత్రికి వరుసగా కష్టాలు వచ్చిపడుతున్నాయట. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసిపడుతున్న తరుణంలో నేతగా ఓ వెలుగు వెలిగారు మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్. తనదైన వాక్చాతుర్యంతో పాటు టీఎన్జీవో అండతో.. బీఆర్ఎస్ నేతగా.. తర్వాత ఎంఎల్ఏగా తర్వాత మంత్రిగా ఎదిగారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అధికారం చేతిలోకి వచ్చిన తర్వాత తన విశ్వరూపం ఆయన చూపారనే ఆరోపణలు ఉన్నాయి. మొదటి ఐదేళ్లు ఎంఎల్ఏ గా తర్వాత ఐదేళ్లు మంత్రిగా అధికారాన్ని శ్రీనివాస్‌గౌడ్ చెలాయించారట. అంతేకాదు.. నియోజకవర్గంలో ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగించారనే పేరునూ సంపాదించుకున్నారు. రెండోతరం లీడర్లను ఎదగనీయకుండా చేశారనే అపవాదునూ శ్రీనివాస్ మూటగట్టుకున్నారట. అధికారంలో ఉండగా.. ఈయనగారు.. అధికారులపైనా పెత్తనం చెలాయించారట. తన అనుమతి లేకుండా ఏ ఒక్క అధికారి లేదా రాజకీయనేత అడుగు ముందుకు వేయడానికి వీలులేనట్లుగా కట్టడి చేశారట. సమస్యలపై ప్రశ్నించిన జర్నలిస్టులు, ఇతర పార్టీల రాజకీయ నాయకులను టార్గెట్ చేసి.. జైలుపాలు చేశారనే వార్తలు గుప్పుమన్నాయి. మహబూబ్‌నగర్ లోని సర్వే నెంబర్ 523లో జరిగిన అవకతవకల కేసులో శ్రీనివాస్ గౌడ్ తమ్ముడు శ్రీకాంత్ గౌడ్ ప్రమేయం ఉందంటూ పోలీసులు కేసు నమోదు చేశారు. అతనితో పాటు ఉన్న మరో ముగ్గురిని.. గతంలోనే రిమాండ్‌కు పంపారు. శ్రీకాంత్ గౌడ్ కొంతకాలం పరారీలో ఉండి ఇటీవల మహబూబ్ నగర్ రూరల్ పోలీసుల వద్ద లొంగిపోయారట. ఎ-4 గా ఉన్న శ్రీకాంత్ గౌడ్ కు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ప్రస్తుతం శ్రీకాంత్ గౌడ్ మహబూబ్ నగర్ జైలులో ఉన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్.. ప్రభుత్వంలోని అన్ని వ్యవస్థలను తన ఇంటి వద్దకే రప్పించుకునే వారట. అలాంటిది సోదరుణ్ని చూసేందుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన వచ్చిందని సొంత పార్టీలోనే చర్చించుకుంటున్నారట. శ్రీనివాస్ గౌడ్‌కు అనుంగ శిష్యులుగా ఉంటూ వచ్చిన వారంతా వరుసబెట్టి ఇతర పార్టీల్లో చేరుతున్నారట. అధికారం ఉన్నంత కాలం తమను పట్టించుకోలేదని..తమ సమయం వృధా అయ్యిందంటూ వారు చర్చించుకుంటున్నట్లు సమాచారం. వారిని నిలువరించలేక రాజకీయంగా గడ్డు కాలాన్ని మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎదుర్కొంటు న్నారట. మరోవైపు.. తన హత్యకు కుట్ర జరిగిందని.. అప్పటి పోలీసుల స్క్రీన్ ప్లే,దర్శకత్వంలో నటించిన శ్రీనివాస్ గౌడ్ ఇటీవల మాట మార్చారట. అత్యుత్సాహంతోనే పోలీసులు ఆ కేసు పెట్టారని తన ప్రమేయం లేదని చెప్పుకుంటున్నారట. ఆయన మాట మారుస్తున్న తీరుపై పాలమూరు జనం మండిపడుతున్నారనే వార్తలు గుప్పుమంటు న్నాయి. శ్రీనివాస్ గౌడ్ మంత్రిగా ఉన్న సమయంలో జరిగిన అక్రమాలపై అధికార పార్టీ సీరియస్‌గా ఉందట. ఆయన చేసిన అరాచకాలను ఒక్కొక్కటిగా బయటపెట్టేందుకు సన్నాహాలు చేస్తోందట. రానున్న రోజుల్లో పక్కా ఆధారాలతో అన్నదమ్ములను.. జైలుకు పంపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా పదేళ్ల పాటు తమ ఇష్టారాజ్యాన్ని కొనసాగించిన సోదరులకు రానున్న రోజుల్లో మరిన్ని కష్టాలు వచ్చి పడేలా ఉన్నాయని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.

# స్పామ్ కాల్స్ తో జరభద్రం

హైదరాబాద్: లోన్ యాప్‌ల పేరుతో సైబర్ నేరగాళ్లు అమాయకులకు మోసాల వల వేస్తున్నారు. బాధితులు ఈ యాప్‌ల ను ఇన్‌స్టాల్ చేసుకోవడంతో, వారి ఫోన్లపై నేరస్తులు నియంత్రణ పొందుతారు. ఎలాంటి డాక్యుమెంట్‌లు లేకుండా చిన్న మొత్తంలో రుణాలు ఇస్తారు, కానీ తర్వాత బాధితుల ఫోటోలను నగ్న చిత్రాలుగా మార్ఫింగ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తారు. కేవలం రెండు వేల నుండి అయిదు వేల రూపాయల వరకు అప్పుగా ఇచ్చి, ఆ తర్వాత లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తారు. డబ్బులు ఇవ్వకుంటే బాధితుల మార్ఫిడి ఫోటోలను సోషల్ మీడియా లో పోస్ట్ చేస్తామని లేదా వాళ్ల పరిచయస్తులకి పంపుతామని బెదిరింపులకు పాల్పడుతారు. వారి బ్లాక్‌మెయిల్‌కు లొంగిపోయి బాధితులు వేలు, లక్షల్లో డబ్బులు పోగొట్టుకోవడమో లేదా అవమానంగా భావించి ఆత్మహత్యలకు పాల్పడడమో చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఫిర్యాదులు పెరిగిపోవడంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు పోలీసులు. లోన్ యాప్ లో రుణాలు తీసుకోవడం ద్వారా తలెత్తే అనర్థాలను వివరిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. లోన్ యాప్ నేరగాళ్ల బారిన పడకండని ?ఒకవేళ మీరు బాధితులు అయితే వెంటనే -100 లేదా 1930 కు కాల్ చేయాలని సూచిస్తున్నారు రాచకొండ పోలీసులు. ఇటీవల హైదరాబాద్ కు చెందిన హర్ష అనే వ్యక్తి ఫోన్‌కు మూడు మెసేజ్ లు వచ్చాయి. 10.09 నుంచి 10.11 గంటల వ్యవధిలో అంటే.. మూడు నిమిషాల వ్యవధిలో రూ.50 లక్షలు రెండుసార్లు.. రూ.10 లక్షలు ఒకసారి.. అంటే మొత్తంగా రూ.1.10 కోట్ల భారీ మొత్తం వేరే ఖాతాలకు బదిలీ అయినట్లుగా బ్యాంక్ నుంచి మేసేజ్ వచ్చింది. వెంటనే హర్ష గుండె జారినంత పనైంది. తన ప్రమేయం లేకుండా ఇంత భారీ మొత్తం బదిలీ కావటంతో తీవ్రమైన ఆందోళనకు గురయ్యాడు. ఆ వెంటనే తేరుకున్న అతను.. కుటుంబ సభ్యుల సహకారంతో బ్యాంకు అధికారుల్ని అప్రమత్తం చేశారు. నిమిషాల వ్యవధిలో అంటే 10.22 గంటల వేళలో 1930 నెంబరుకు ఫోన్ చేసి తనకు జరిగిన మోసాన్ని వివరించారు. వెంటనే స్పందించిన కేంద్ర సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్.. జరిగిన మోసానికి సంబంధించిన సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్ మెంట్ సిస్టం సిబ్బందిని రంగంలోకి దించారు. తెలంగాణలో ఈ మోసం జరగటంతో వెంటనే రియాక్టు అయిన తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సీన్‌లోకి వచ్చేసింది. బాధితుడి బ్యాంక్ ఖాతా నుంచి బదిలీ అయిన మొత్తం యాక్సిస్.. హెచ్ డీఎఫ్ సీ బ్యాంకుల ప్రతినిధుల్ని అప్రమత్తం చేశారు. దీంతో బ్యాంక్ సిబ్బంది సైతం స్పందించి.. నిధుల్ని డ్రా చేయకుండా పుట్ ఆన్ హోల్డ్ చేశారు. ఇదే విషయాన్ని బాధితుడికి రూ.10.42 గంటల వేళలో ఫోన్ కు మెసేజ్ వచ్చింది. సైబర్ నేరస్తులు దోచేసిన రూ.1.10 కోట్లలో కేవలం రూ.10 వేలు మాత్రమే నేరస్తులు డ్రా చేయగలిగారు. దీంతో.. డ్రా చేసిన బ్యాంకు ఖాతాను బెంగళూరులోని ఖాతాలుగా గుర్తించారు. బాధితుడి ప్రమేయం లేకుండా డబ్బులు ఎలా డ్రా అయ్యాయి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. దీనిపై పోలీసులు ఫోకస్ చేశారు. సైబర్ నేరస్తుల బారిన ఎవరు పడినా.. నిమిషాల్లో స్పందించి "1930" కు ఫోన్ చేస్తే.. డబ్బులు డ్రా కాకుండా అడ్డుకునే వీలుందని పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని మీకు తెలిసిన వారందరికి చెప్పండి. అందరిలోనూ "1930" నెంబరు మీద అవగాహన పెరిగేలా చేయాల్సిన అవసరం ఉంది.

# 17, 18 తేదీల్లో గ్రూప్ 3 ఎగ్జామ్స్

హైదరాబాద్: లంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-ఎఎఎ సర్వీసెస్ పరీక్షకు సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసింది. మొత్తం 1,365 గ్రూప్ ఎఎఎ ఖాళీలను భర్తీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. " పరీక్ష రోజున ఉదయం 08.30 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారు. ఉదయం 09.30 గంటలకు గేటు మూసివేస్తారు. అదే రోజు మధ్యాహ్నం సెషన్‌కు 1:30 గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అదే సెషన్‌కు మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేసిన తర్వాత ఏ అభ్యర్థిని లోపలికి అనుమతించరు. గ్రూపు 3 పరీక్ష నవంబర్ 17, నవంబర్ 18 తేదీలలో నిర్వహించనున్నారు. నవంబర్ 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లు ఉంటాయి. నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఒక సెషన్ ఉంటుంది. నవంబర్ 10, 2024 నుంచి టీఎస్‌పీఎస్‌సీ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టీఎస్‌పీఎస్‌సీ గ్రూప్ 3 2024 అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ చేసుకోండిలా :

అడ్మిట్ కార్డ్ రిలీజ్ తర్వాత అధికారిక టీసీపీఎస్‌సీ వెబ్‌సైట్ కి వెళ్లండి హోమ్‌పేజీలో గ్రూప్ 3 అడ్మిట్ కార్డ్ 2024 కోసం లింక్‌పై క్లిక్ చేయండి. మీ లాగిన్ వివరాలను ఎంటర్ చేసి, దశను సమర్పించండి. టీఎస్‌పీఎస్‌సీ అడ్మిట్ కార్డ్‌ని రివ్యూ చేసి డౌన్‌లోడ్ చేసుకోండి. ఫ్యూచర్ రిఫరెన్స్ కోసం అడ్మిట్ కార్డ్ హార్డ్ కాపీని ప్రింట్ చేయండి. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్ టికెట్, ప్రశ్నాపత్రాలను అన్ని సెషన్ల నుంచి తప్పనిసరిగా దగ్గర ఉంచుకోవాలి. అవసరమైతే వాటిని చూపించవలసి ఉంటుంది. డూప్లికేట్ హాల్ టికెట్ తరువాత జారీ చేయరని గమనించాలి.

# మున్నూరు కాపులు సమాజానికి దిక్సూచిగా నిలవాలి

## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పెద్దపల్లి: మున్నూరు కాపులు సమాజానికి దిక్సూచిగా నిలబడాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి జిల్లా బందంపల్లిలో ఆదివారం మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనం మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతవండు మహేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ జడ్పీ చైర్మన్ పుట్ట మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ మున్నూరు కాపుల్లో విభేదాలు ఉన్నా పార్టీలకు అతీతంగా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మున్నూరు కాపులు మరింత బలోపేతం చెందాలని ఆకాంక్షించారు. కాపు కులాన్ని పటిష్ఠం చేస్తూ ఇతర కులాల ఆదరణ పొందడం ద్వారా రాజకీయంగా పరింత రానించవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇతర కులాలతో కలిసి నడిస్తే బిసిలకు రాజ్యాధికారం సరియైన వాటా దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కులాల లెక్క తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఎన్యుమరేటర్లతో సర్వే చేపడుతున్నామని, 50 ప్రశ్నలతో 150 కుటుంబాలకు ఒక ఎన్యూమరేటర్ సర్వే చేస్తారని, సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. కులగణన తర్వాత బిసిలకు 52 శాతం రిజర్వేషన్లు దక్కే చాన్సు ఉందన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1పరీక్షల్లో 519 పోస్టులకు 33 వేల మంది అభ్యర్థులు హాజరు కాగా 57.11 శాతం బీసీలు ఎంపికయ్యారని గుర్తు చేశారు. ఓసీలు కేవలం 8.9శాతం మాత్రమే ఎంపికయ్యారు అన్నారు. గ్రూప్ 1 పరీక్షలపై జరిగిన రాద్ధాంతం ఒత్తిదేనని తేలిందన్నారు. ఎక్కువ శాతం బీసీలు ఎంపికవ్వడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బీసీలకు కాంగ్రెస్ సర్కార్ మేలు చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధులను సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు అనుమాల మహేష్, యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్, జిల్లా అధ్యక్షులు తొగరి సురేష్, నాయకులు ఎడ్ల రవి, డాక్టర్ రాజ్ కుమార్, అనిల్, కిషన్, బాలకృష్ణ, రాజేందర్, తోట కాంతయ్య, పూదరి కిషన్, దాసరి రాజేశం, కాపు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంఘం నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రయివేట్ సంస్థలతో యూనివర్సిటీకున ఒప్పందం రద్దు

## – వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ జానయ్య




రాజేంద్రనగర్: 2022 జులై వరకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రయివేట్ సంస్థలు చేసుకున్న అవగాహనా ఒప్పందాలు విశ్వవిద్యాలయ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్నందున వాటిని రద్దు చేసుకున్నట్టు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీతో భాగస్వామ్యం ఉందని చెప్పుకొంటున్న ప్రయివేట్ సంస్థలతో ఉన్న ఒప్పందాలను సోమవారం రద్దు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రయివేట్ సంస్థలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ప్రయివేట్ సంస్థలతో వ్యవసాయ విద్యా కోర్సుల కోసం భాగస్వామ్యంగానీ, గుర్తింపు ఇవ్వడంతో గానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. కొన్ని ప్రయివేట్ సంస్థలు అగ్రికల్చర్ యూనివర్సిటీ పేరును వాడుకొని వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా, బ్రోకర్ల ద్వారా సీట్లు ఇప్పిస్తామని, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీతో అనుబంధం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాలను నమ్మవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు.

# మెట్రో పనులు ప్రారంభం

హైదరాబాద్: రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెట్రో రైలు విస్తరణ పనుల్లో కీలక పురోగతి చోటుచేసుకుంది. భాగ్య నగరం నలుమూలలకు మెట్రో సేవల్ని అందించేలా ప్రణాళికలు రూపొందించగా.. తాజాగా పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు హైదరాబాద్ మహా నగరంలో కొన్ని ప్రాంతాలకే మెట్రో పరిమితమైన వేళ.. నూతన ప్రణాళికతో ఐదు నూతన కారిడార్లకు ప్రతిపాదనలు చేశారు. మొత్తంగా రెండో దశ పనులకు రూ. 24,269 కోట్లు అవసరమని అధికారులు అంచనాలు రూపొందించగా.. అందులో 30 శాతం నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వ వాటాగా సమకూర్చాల్సి ఉంటుంది. అంటే.. రూ.7313 కోట్లు. కేంద్రం సైతం ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించనుండగా కేంద్రం వాటాగా 18 శాతం అంటే రూ. 4,230 కోట్లు ఖర్చు చేయనుంది. ప్రాజెక్టులో మిగతా 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా ప్రభుత్వం డీపీఆర్ రూపొందించింది. నగర శివారు ప్రాంతాల నుంచి రోజు లక్షల మంది నగరంలోకి ప్రవేశిస్తుంటారు. వారికి ప్రస్తుతం మెట్రో అనుకున్న మేర సేవలు అందిచలేకపోతోంది. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో పెట్టుకుని.. నగరం నలుమూలలకు మెట్రో విస్తరణ జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన విధానాలతో ప్రణాళికలు రూపొందించింది. ఇప్పటి వరకు మూడు కారిడార్ల పనులు పూర్తవగా.. నాలుగో కారిడార్ గా నాగోల్ టూ శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు మెట్రో పరుగులు తీయనుంది. 35.8 కి.మీ మేరు చేపట్టనున్న నిర్మాణాలు.. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ జోరు మరింత పెంచే అవకాశాలున్నాయని అంచనాలున్నాయి. ఐదో కారిడార్ లో భాగంగా.. ఐటీ ప్రాంతాలైన రాయదుర్గ్ నుంచి కోకాపేట్ నియోపొలిస్ వరకు 11.6 కి.మీ మెట్రో నిర్మించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. ఇక.. ఆరో కారిడార్లో ఆరో కారిడార్లో.. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయన్ గుట్ట వరకు 7.5 కి.మీ, ఏడో కారిడార్ మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు (13.4 .మీ), ఎనిమిదో కారిడార్ ఎల్‌బీనగర్ టూ హయత్ నగర్ వరకు 7.1 కి.మీ. మేర నూతన కారిడార్ అందుబాటులోకి రానుంది. హైదరాబాద్ కు సిటీ చుట్టు పక్కల నుంచి భారీగా రోజు వారీ కార్మికులు, ఉద్యోగాలు వస్తుంటారు. వారు నేరుగా గమ్య స్థానాలకు చేరుకునే వెసులుబాటు లేకపోవడంతో.. ఆటోలు, బస్సులో మెట్రో స్టేషన్ వరకు రావడం అక్కడి నుంచి మెట్రోలో ప్రయాణించాల్సి వచ్చేంది. మెట్రో దిగిన తర్వాత.. మళ్లీ ఆటోలు, బస్సుల్లో గమ్య స్థానాలకు వెళ్లాల్సిన పరిస్థితి. అందుకే.. నగరంలో అవసరమైన అన్ని మార్గాల్లో నూతన మెట్రోను పరుగులు తీయించాలని భావించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఐదు నూతన కారిడార్ల డీపీఆర్ లను సిద్ధం చేసి.. పరిపాలన అనుమతులు ఇచ్చింది.

### కేంద్రానికి ముడిపెట్టిన రేవంత్

హైదరాబాద్ ప్రజలు ఎప్పుడెప్పుడా అని చూస్తున్న మెట్రో రెండో దశ పనులకు ముహూర్తం వచ్చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ పనులకు రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. ఇప్పుడు రెండో దశలో భాగంగా 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణం చేపట్టనుంది. ఇందుకోసం ప్రభుత్వం జీవో 196ని జారీ చేసింది. రెండో విడత మెట్రో రైలు ప్రాజెక్టు వ్యయం రూ.24,269 కోట్లు కాగా.. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.7,313 కోట్లను వెచ్చిస్తోంది. ఇప్పటికే నగరంలో కొత్తగా 5 మార్గాల్లో మెట్రో రెండో దశ పనులు చేపట్టనున్నారు. కారిడార్ 4లో నాగోలు-శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలోమీటర్లు, కారిడార్ 5లో రాయదుర్గ-కోకాపేట వరకు 11.6 కిలోమీటర్లు, కారిడార్ 6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రయాణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు, కారిడార్ 7లో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4కిలోమీటర్లు, కారిడార్ 8లో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్లు నిర్మించనున్నారు. మొత్తంగా రెండో దశలో 116.4 కిలోమీటర్లు ఈ రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రతిపాదించారు. మొదటగా పార్ట్ ఏ కింద 76.4 కిలోమీటర్ల మార్గానికి పరిపాలన అనుమతులు మంజూరైనట్లు, పార్ట్ బిలో నిర్మించనున్న శంషాబాద్ విమనాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలోమీటర్ల మార్గానికి సర్వే జరుగు తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఇక హైదరాబాద్‌లో మెట్రో ఏర్పాటైనప్పటి నుంచి రోజుకు 5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే మరో 8 లక్షల మంది ప్రయాణించే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మెట్రో మొదటి దశ పూర్తయి చాలా కాలం కాగా.. ఇప్పటి వరకూ రెండో దశ అడుగు ముందుకు పడలేదు. హైదరాబాద్ నగరంలో చాలా పరిమిత ప్రాంతాల వరకే మెట్రో విస్తరించి ఉంది. దీంతో ట్రాఫిక్ కొంత వరకు మాత్రమే తగ్గింది. ప్రజావసరాలను తీర్చేందుకు పూర్తిస్థాయిలో ఉపయోగపడలేదు. అందుకే.. రేవంత్ సర్కార్ రెండో విడతకు శ్రీకారం చుట్టింది. దీంతో శివారు ప్రాంతాలకూ మెట్రో విస్తరించనుంది. దీంతో మహానగరానికి మరింత గుర్తింపు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అయితే.. రెండో విడత కోసం తెలంగాణ ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూరుస్తోంది. 18 శాతం నిధులను కేంద్రం ఇస్తోంది. మిగిలిన నిధులను రుణాలు, పీపీపీ పద్ధతిలో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. రెండో దశ మీద ఎంతో కాలంగా ఆశలు పెట్టుకున్నప్పటికీ పరిపాలన అనుమతులు రాలేదు. కానీ.. తాజాగా ప్రభుత్వం అన్ని అనుమతులు జారీ చేసింది. ఎలాగూ కేంద్రం కూడా సహకరిస్తుండడంతో రెండో దశ పనులు వెంటనే ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి కేంద్రంతోనూ సఖ్యతగానే ఉంటుండడంతో.. కేంద్రం కూడా సహకరించేందుకు ముందుకు వస్తున్నది. మొత్తంగా రెండో దశ మెట్రో కూడా పనులు పూర్తయితే ఇటు ప్రయాణికులకు మరింత ట్రాఫిక్ కష్టాలు తప్పనున్నాయి. అటు విశ్వనగరం ఖ్యాతి కూడా మరింత పెరగనుంది

# 568 మందులు ఫ్రీ...

హైదరాబాద్: ప్రభుత్వాసుపత్రుల్లో మందుల కొరతపై తెలంగాణ ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత ఉన్న సంగతి తెలిసిందే. డాక్టర్లు వైద్యం అందించినా మందులు మాత్రం బయట ఫార్మసీలోనే కొనుక్కోవ్వాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రధాన ఆస్పత్రుల్లో కొన్ని మందులు ఇచ్చినా పూర్తిగా మాత్రం ఇవ్వలేని పరిస్థితులు ఉన్నాయి. ఇక ఎన్నికల్లో ఇచ్చిన ఒక్కో హామీని నెరవేరుస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత లేకుండా చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అత్యవసర, అదనపు జాబితా కింద 568 మందులతో లిస్ట్ సిద్ధం చేసింది. వీటిని జిల్లాకు ఒక డ్రగ్స్ స్టోర్ ఏర్పాటు చేసి సరఫరా చేయాలని నిర్ణయం తీసుకుంది. దీని నుండి డ్రగ్స్ కొరత లేకుండా వైద్య కళాశాలలకు, జిల్లా ఆస్పత్రులకు, ప్రాంతీయ వైద్యశాలలకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులను తరలించనున్నారు. గతంలో పది ఉమ్మడి జిల్లాల్లో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ల నుండి మందులు సరఫరా చేసేవారు. అయితే ప్రస్తుతం ఆస్పత్రుల్లో మందుల కొరత నెలకొనడంతో ప్రతి జిల్లాకు ఒక డ్రగ్స్ స్టోర్ ఏర్పాటు చేయాలని ఆలోచన చేసింది. అదేవిధంగా దవఖానాల్లో కృత్రిమ కొరత ఏర్పడకుండా ప్రతిరోజు అవసరమైన ఔషదాల జాబితాను డ్రగ్స్ స్టోర్ కు పంపేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని డ్రగ్స్ స్టోర్ లో ఏవైనా మందులు లేనట్టయితే వెంటనే సమీపంలో ఉన్న జిల్లా నుండి ఆ మందులు తెచ్చుకోవాలని, కానీ రోగులను ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి పంపకూడదని ఆదేశించింది. మరోవైపు ఫార్మసిస్టులు, సీడీఎస్ నిర్వాహకులు అవకతవకలకు పాల్పడకుండా టాస్క్ ఫోర్స్ బృందాన్ని నియమచింది. ఈ బృందం తరచూ ఆస్పత్రులకు వెళ్లి అక్కడ మందుల కొరత ఉందా లేదా అనేదానిపై పర్యవేక్షించాల్సి ఉంటుంది.

# జనవరిలో పంచాయితీ ఎన్నికలు

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారం మారిపోయింది. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేలిపోయింది. తెలంగాణలో ప్రధాన పార్టీలు ఇప్పుడు మరో అగ్నిపరీక్షకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల జాతరకు.. త్వరలోనే తెరలేవబోతోంది. కొత్త సంవత్సరంలోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసేందుకు సర్కార్ ఏర్పాట్లు చేస్తోంది. సర్పంచ్ ఎన్నికలకు డిసెంబర్ నెలలోనే ముహూర్తం ఫిక్స్ చేసినట్లు స్పష్టం చేశారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. 2025 జనవరి నెలలో గ్రామాలకు కొత్త సర్పంచ్‌లు వస్తారంటూ మీడియా చిట్‌చాట్‌లో స్పష్టం చేశారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధంకావాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ఆ తర్వాత మున్సిపల్ ఎన్నికలు ఉంటాయని ఎస్ఈసీ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 12 వేల 751 గ్రామ పంచాయతీల పదవీకాలం ఈ ఏడాది జనవరిలోనే ముగిసింది. అప్పటి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. పంచాయతీ ఎలక్షన్లు నిర్వహించకపోవటంతో రాష్ట్రానికి రావాల్సిన రూ. 1,800 కోట్ల నిధులు కేంద్రవద్దే ఉండిపోయాయి. దీంతో సత్వరమే ఎన్నికలను నిర్వహించి, ఆ నిధులను తెచ్చుకోవాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ. 2025లో నిర్వహించబోయే అన్ని ఎన్నికలకు ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే రూపొందించింది. మరోవైపు ఈనెల ఆరు నుంచి సమగ్ర కుల గణన ప్రారంభం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను త్వరలోనే ఎంపిక చేస్తామని ప్రకటించారు మంత్రి పొంగులేటి. దీన్నిబట్టి పంచాయతీ నగరాకు అధికార పార్టీ ఇప్పటికే సన్నద్ధమయినట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో బీసీల లెక్క తేలాల్సిందే.. వాళ్లకు దక్కాల్సిన వాటా దక్కాల్సిందే అని ఎన్నికలకు ముందునుంచీ చెబుతూ వస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఆ దిశగానే సమగ్ర కులగణన చేపట్టింది. ప్రభుత్వం చేపట్టిన కులగణన నవంబర్ 30తో ముగియనుంది. ఆ రిపోర్ట్ ఆధారంగా స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను ఖరారు చేసి స్థానిక ఎన్నికలను నిర్వహించనుంది రేవంత్ రెడ్డి సర్కార్. అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవే కావడంతో వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలకు ఇప్పటికే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకున్న అధికార పార్టీ..భారీ సంఖ్యలో తన మద్దతుదారులను గెలిపించుకునే వ్యూహంలో ఉంది. రుణమాఫీ కార్యక్రమంతో పాటు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు పంచాయతీ ఎన్నికల్లో కలిసొస్తాయన్న ధీమాతో ఉంది అధికారపార్టీ. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటిన బీఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లోనూ పట్టు నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్‌లో సత్తాచాటిన కారుపార్టీ.. పంచాయతీ ఎన్నికల్లో విజయంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ తమ బలం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భారాన్ని ఈ ఎన్నికల్లో దించుకోవాలన్న వ్యూహంతో ఉంది ప్రతిపక్ష బీఆర్ఎస్. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బలం పుంజుకున్న బీజేపీకి కూడా పంచాయతీ, స్థానిక సంస్థలు సవాలుగా మారబోతున్నాయి. క్షేత్రస్థాయిలోనూ బలం ఉందని నిరూపించు కోవాలంటే స్థానిక సంస్థల్లో కూడా సత్తా చాటాల్సి ఉంటుంది. ఒకరికిద్దరు కేంద్రమంత్రులున్నా పార్టీ రాష్ట్ర సారథిపై నాయకత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలు కావటంతో త్వరగా కొత్త అధ్యక్షుడెవరో తేలిస్తే ఎన్నికలకు సిద్ధంకావచ్చంటోంది ఆ పార్టీ కేడర్. మొత్తానికి 11 నెలల గ్యాప్ తర్వాత మళ్లీ తెలంగాణలో ఎన్నికల హడావుడి మొదలు కాబోతోంది. గల్లీదాకా పార్టీజెండా ఎగిరే ఎన్నికలు కావటంతో మూడు ప్రధానపార్టీలకూ అత్యంత కీలకం కాబోతున్నాయి.

# సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలి

నల్గోండ: ప్రభుత్వ ప్రాధాన్య పథకాల పై అధికారులు ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రవేశపెట్టే నూతన అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలపై జిల్లా అధికారులు మొదలుకొని, గ్రామస్థాయి వరకు ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నదని , సంబంధిత శాఖల అధికారులు రైతులకు, మిల్లర్లకు ఎవరికీ ఇబ్బందులు కలగకుండా పద్ధతి ప్రకారం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మరో కార్యక్రమం సామాజిక, ఆర్థిక ,రాజకీయ,విద్య సర్వే అతిముఖ్యమైందని, ఈ సర్వే కేవలం సమాచార సేకరణకు మాత్రమే ఉద్దేశించిందని ఆమె స్పష్టం చేశారు . ఈ సర్వేలో భాగంగా ఈనెల 6 నుండి ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకుగాను జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని, అన్ని మున్సిపాలిటీలు ,మండల కేంద్రాలలో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని, ఈ శిక్షణ కార్యక్రమంలో ఇండ్ల జాబితా తయారు అనంతరం ఇంటింటికి వెళ్లి వివరాల సేకరణ, తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, వాణిజ్య సంస్థలు కాకుండా మనుషులు నివసిస్తున్న అన్ని ఇండ్లకు వెళ్లి ఎన్యుమరేటర్లు వివరాలు సేకరించాలని, వివరాల సేకరణ అనంతరం ఆ ఇంటికి స్టిక్కర్ ను అతికించాలని తెలిపారు .సామాజిక, ఆర్థిక, రాజకీయ,విద్య సర్వే నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ,విద్య సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని , ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారుల భాగస్వామ్యం అవసరమని, 100% చిత్తశుద్ధితో సామాజిక ,ఆర్థిక, రాజకీయ,విద్య సర్వేను నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. కాగా ఈ సోమవారం (45) మంది ఫిర్యాదు దారులు వారి ఫిర్యాదులను సమర్పించారు. ఎప్పటిలాగే ఈ సోమవారం సైతం పింఛన్లు, విద్య ,ఉపాధి,వ్యక్తిగత అంశాలు, తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు ఉన్నారు

# స్వైర విహారం చేస్తున్న కుక్కలు

హైదరాబాద్: హైదరాబాద్ లో వీధికుక్కలు భయపెడుతున్నాయి. ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలంటేనే భయమేసే పరిస్థితి వచ్చింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఎక్కడ చూసినా.. ఏ వీధిలో చూసినా గుంపులు.. గుంపులు వీధికుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. బయటకు వచ్చిన వెంటనే అవి మీద పడి కరిచేస్తున్నాయి. ఒంటరిగా మహిళలు, వృద్ధులు, పిల్లలు బయటకు రావడానికే జంకుతున్నారు. ఒకవేళ పొరపాటున వస్తే కుక్కల బారిన పడి గాయాలపాలవుతున్నారు. దీంతో హైదరాబాద్ లో కుక్కలను పారదోలండయ్యా బాబూ అంటూ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు. తమ వీధికి మున్సిపాలిటీ కుక్కల వ్యాన్ వచ్చి కొన్ని నెలలవుతుందని తెలిపారు. వీధి కుక్కల బారిన పడి తాజాగా బోరబండలో ఒక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడికి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎక్కువ మంది చిన్నారులు, వృద్ధులు, మహిళలు కుక్కల దాడిలో గాయపడి చికిత్స పొందేందుకు వస్తున్నారు. వందల సంఖ్యలో రోగులు వస్తుండటంతో రేబిస్ వ్యాక్సిన్ కూడా కొన్ని ఆసుపత్రుల్లో దొరకడం లేదు. బయట నుంచి తెచ్చుకోవాలంటూ ఆసుపత్రి సిబ్బంది చెబుతుండటంతో గాయపడిన వారి బంధువులు ఆవేదన చెందుతున్నారు. ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళ హైదరాబాద్ లో ఈ కుక్కల దాడి ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఏదైనా బజారు నుంచి తెచ్చుకోవాలనుకున్నా మహిళలు భయపడిపోతున్నారు. వాటి కోసం కుక్కలు వెంటపడి తరుముతున్నాయి. ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో వీధికుక్కలు మహిళలు, చిన్నారులపై విరుచుకుపడిన సందర్భాలు ఇటీవల కాలంలో అనేకం ఉన్నాయి. ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని, కుక్కల బెడద హైదరాబాద్ నగరంలో సమస్య మాత్రం చాలా తీవ్రంగా ఉందని చెబుతున్నారు. రాత్రి వేళ ఆ కుక్కల అరుపులతో నిద్ర కూడా పట్టడం లేదని, వీటిని ఇక్కడి నుంచి తరలించాలంటూ అనేక మంది మున్సిపల్ సిబ్బందికి మొరపెట్టుకుంటున్నారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంతో కుక్కల బెడద హైదరాబాద్ ను పట్టుకుని వేధిస్తూనే ఉంది.

# సమూహం నుంచి ఒంటరితనంలోకి వెళ్లడం ప్రమాదకరం

**- స్తబ్దత నుంచి బయటపడి సరికొత్త సృజనకు కవులు ఉపక్రమించాలి :తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి**

**- సంస్థ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాహిత్య సదస్సు**

**- కవితా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం**



నల్లగొండ: సమాజం సమూహం నుంచి చీలి ఒంటరితనంలోకి వెళ్ళిపోవటం చాలా ప్రమాదకరమని, కవులు, రచయితలు స్తబ్దత నుంచి బయటపడి సరికొత్త సృజనకై ఉపక్రమించాలని, అందుకోసం సమాజాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితీ సంస్థ ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి రాను రాను ప్రేమ భావన నుంచి వైదొలిగి కాఠిన్యం వైపు ఆలోచించడం ఆందోళనకరమన్నారు. ప్రముఖ కవి, రచయిత, పరిశోధకులు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సాహిత్య రంగంలో అభ్యుదయ సాహిత్యం నుంచి ఇప్పటివరకు వచ్చిన సాహితీ సంస్థలు, వాటి దృష్టి కోణాలు, పరిమితులను వివరించారు. ఇన్నాళ్లు అణగారిన వారి జీవితాలపై ఆధిపత్యం చేసిన మత దురహంకారం మళ్లీ పడగ విప్పి విజృంభిస్తోందన్నారు. ఇది సాధారణ ప్రజల జీవితాలకు ప్రమాదకరమని, అందుకే వాటిని ప్రశ్నించే వైఖరితో రచయితలు, కవులు స్పందించాలని తెలిపారు. ముఖ్యంగా యువ రచయితలు ఈ పనికి పూనుకోవాలని తెలిపారు. అనంతరం ప్రముఖ కవి, రచయిత తండు కృష్ణ కౌండిన్య నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో కవులందరూ పాల్గొని తమ తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా తెలంగాణ సాహితీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహ్మద్ సేన, ఆత్మీయ అతిథిగా కవి రచయిత మోత్కూరు శ్రీనివాస్ వ్యవహరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను శాలువాలతో సత్కరించారు. సాహితీ ఉత్సవాల సందర్భంగా డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీల్లో ఉమ్మడి జిల్లా విద్యార్థులు 147 మంది కవితలను రాయగా వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, ఐదు కన్సొలేషన్ బహుమతులు గెలుచుకున్న విజేతలకు ఆనందాచారి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కాగా, ఉదయం ప్రారంభమై ఆరు సెషన్లుగా సాగిన ఈ కార్యక్రమంలో 'స్వీయ కవితల్లో వస్తువులు' అంశంపై జీవకవి మునాస్ వెంకట్, 'స్వీయ కథల్లో సామాజిక జీవన చిత్రాలు' అంశంపై ప్రముఖ కథా రచయిత భూతం ముత్యాలు, 'స్వీయగీతాల్లో సామాజిక స్పృహ' అంశంపై ప్రముఖ గాయకుడు అంబటి వెంకన్న ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ సాగర్ల సత్తయ్య, తెలంగాణ సాహితీ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహనకృష్ణ, ప్రముఖ బాల సాహిత్యవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు, ప్రముఖ కవి, గాయకులు ఏబూసి నరసింహ, వేముల వెంకటేశ్వర్లు, ప్రముఖ కథా రచయిత శీలం భద్రయ్య, ప్రభుత్వ బాల సాహితీవేత్త పుప్పాల కృష్ణమూర్తి, ఉనికి సాహిత్య వేదిక అధ్యక్షులు బండారు శంకర్, సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్, విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు దాసోజు శ్రీనివాసచారి, నల్లగొండ లయన్స్ క్లబ్ చాలెంజర్స్ అధ్యక్షులు వనం శ్రీకిషన్, ప్రముఖ న్యాయవాది యన్ భీమార్జునరెడ్డి, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# ఆ పది రాష్ట్రాల్లోనే సౌండ్ పార్టీలు

ముంబై: దేశంలో సంపన్నులు పెరుగుతున్నారు. 2023 ఐటీఆర్ లెక్కల ప్రకారం.. భారత్‌లో కోటీశ్వరులు పెరిగారు. గడిచిప పదేళ్లలో కోటీశ్వరులు బాగా పెరిగారు. అయితే ఈ సంపన్నులు కూడా కొన్ని రాష్ట్రాల్లోనే ఎక్కువగా ఉన్నారు. భారతదేశంలో గడిచిన పదేళ్లుగా కోటీశ్వరులు పెరుగుతున్నారు. 2014కు ముందు మన దేశంలో ఉన్న కోటీశ్వరలుతో పోలిస్తే.. 2023లో కోటీశ్వరులు భారీగా పెరిగారు. గతంలో కూడా వీరు ఉన్నారు. కానీ, ఐటీ చెల్లించేవారు కాదు. పదేళ్లుగా కేంద్రం తీసుకుంటున్న చర్యలతో పన్ను చెల్లించేవారు పెరుగుతున్నారు. దీంతో వీరి వివరాల ఆధారంగానే కేంద్రం దేశంలో కోటీశ్వరులు పెరుగుతున్నట్లు ప్రకటిస్తోంది. గడిచిన ఐదేళ్లలో అయితే కోటీశ్వరులు చెపుపకోదగిన స్థాయిలో పెరిగారు. అయితే సంసన్నులు కొన్ని రాష్ట్రాలకే పరిమితమవుతున్నారు. సంపద కొన్ని రాష్ట్రాల్లోనే పెరుగుతోంది. 2024లో ఎక్కువ మంది ధనవంతులు ఉన్న రాష్ట్రాల జాబితాను హురున్ ఇండియా రిచ్ లిస్టు విడుదల చేసింది. ఏ రాష్ట్రంలో ఎంత మంది ధనవంతులు ఉన్నారనే విషయాన్ని కూడా ఇందులో తెలిపింది. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో 2020తో పోలిస్తే ధనవంతులు పెరగగా, తమిళనాడు, కర్ణాటకలో తగ్గారు. ఇది ఆ రాష్ట్రాల ఆర్థిక కార్యకలాపాల పెరుగుదలను, సంపద సృష్టిని ప్రతిబింబిస్తుంది. అగ్రస్థానంలో మహారాష్ట్ర.. దేశంలో ధనవంతులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో మొదటి స్థానంలో ఉంది మహారాష్ట్ర. ఈ రాష్ట్రంలో మొత్తం 470 మంది సంపన్నులు ఉన్నారు. 2020లో 247 మంది ఉండగా, గడిచిన నాలుగేళ్లలో వీరి సంఖ్య 222 పెరిగింది. ఇక తర్వాతి స్థానంలో ఢిల్లీ నిలిచింది. ఈ రాష్ట్రంలో 2020లో 128 మంది ఉండగా, ఇపుపడు 213కు చేరింది. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ రాష్ట్రంలో 129 మంది, దక్షిణాది రాష్ట్రం తమిళనాడులో 119 మంది ధనవంతులు ఉన్నట్లు హురున్ ఇండియా రిచ్‌లిస్ట్ వెల్లడించింది. రాష్ట్రాల్లో 2020లో వరుసగా 60, 65,మంది ధనవంతులు మాత్రమే ఉండేవారు. గుజరాత్, తమిళనాడు లోనూ ధనవంతుల గణనీయంగా పెరిగారు. ఇక తెలంగాణలో 109 మంది ధనవంతులు ఉన్నారు. 2020లో తెలంగాణలో కేవలం 54 మంది సంపన్నులు ఉండగా, ప్రస్తుతం రెట్టింపు అయింది. ఇక ఐటీ రాజధాని కర్ణాటకలో సంపన్నులు తెలంగా ణ కన్నా తక్కువ. ఈ రాష్ట్రంలో 108 మంది ఉన్నారు. 2020లో కర్నాటకలో 72 మంది ఉన్నారు. నాలుగేళ్లలో పెరిగినా, తెలంగాతో పోలిస్తే పెరుగుదల తక్కువగా ఉంది. పశ్చిమబెంగాల్, హర్యానా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు కూడా సంపన్నులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో వరుసగా 70, 40, 36, 28 మంది సంపన్నులు ఉన్నారు. 2020లో ఈ రాష్ట్రాల్లో ధనవంతుల సంఖ్య వరుసగా 32, 16, 9, 9గా మాత్రమే ఉండేది. గడిచిన నాలుగేళ్లలో కుబేరుల సంఖ్య భారీగా పెరిగింది. వెనుకబడిన తమిళనాడు, కర్ణాటక.. 2020లో ధనవంతుల జాబితాలో ముందు వరుసలో ఉన్న తమిళనాడు, కర్ణాటక ఈసారి వెనుకబడ్డాయి. ఆ రాష్ట్రాల్లో సంపన్నులు పెరిగినా, వృద్ధిరేటు తక్కువగా ఉంది. మొత్తంగా 2024లో మనదేశంలో ఉన్న ధనవంతుల సంఖ్య 1,322. 2020లో ఈ సంఖ్య కేవలం 693 మాత్రమే. నాలుగేళ్లలో ధనవంతులు రెట్టింపు అయ్యారు.

# వడ్లు కొనడం లేదని అన్నదాతల ఆగ్రహం

**- సిరిసిల్ల జిల్లాలో ధర్నా**

**- కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చిన కలెక్టర్**



ఎల్లారెడ్డిపేట: కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15రోజులు అయినా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆగ్రహం వక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రధాన రహదారిపై ఆదివారం ధర్నా చేశారు. స్పందించిన కలెక్టర్ కేంద్రం వద్దకు వచ్చి రైతులకు హామీ ఇచ్చి ధాన్యం కొనుగోలును ప్రారంభించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిర గ్రామంలోని ఐకేపీ సెంటర్లలో ధాన్యం పోసి నెల రోజులైనా కొనుగోలు చేయడం లేదని గ్రామ రైతులు కామారెడ్డి %-% సిరిసిల్ల ప్రధాన రహదారిపై వడ్లు పోసి బైటాయించారు. వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో పాల్గొన్న మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు తో అధికారులు ఫోన్‌లో మాట్లాడి ధర్నా విరమింప చేయాలని కోరారు. అయినా రైతులు ఆందోళన కొనసాగింది. సమచారం అందుకున్న పోలీసులు ధర్నా స్థలానికి చేరుకొని వారితో మాట్లాడి విరమింపచేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ స్పందించి పదిర ఐకేపీ సెంటర్‌ను సందర్శించి వెంటనే వడ్లను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చి కేంద్రాన్ని ప్రారంభించారు. ధర్నాలో సుమారు 100 మంది పైగా రైతులు పాల్గొన్నారు.

# ఫౌంటేన్ కాదు..లీకేజీ..!

**- హనుమకొండ జిల్లాలో దేవాదుల నీరు వృధా**



హనుమకొండ: హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లె శివారు చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్‌కు దేవాదుల రెండో విడతలో పంపింగ్ అయ్యే పైపులైన్ ఎయిర్‌వాల్ లీకేజీ అయింది. దాంతో నీరు ఎగిసిపడుతూ ఫౌంటేన్‌ను తలపించింది. మైలారం నుంచి సున్నపురాళ్ల గడ్డ మీదుగా పెద్దకోడపాకకు వెళ్లే దారిలో మహేందర్ రెడ్డి పొలం సమీపంలో శనివారం రాత్రి పైప్‌లైన్ ఎయిర్ వాల్ లీకై 100 మీటర్ల ఎత్తుతో నీరు ఎగిసి పడుతోంది. పక్కనే 220 విద్యుత్ లైన్ల పై నీరు పడుతుండటంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లీకేజీ నీటితో చుట్టుపక్కల ఉన్న పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. మూడు నెలల కిందట వరి పంట సాగు చేశామని, వంట చేతికి అందివచ్చిందని, కోతలు కోసే తరుణంలో పైపులైను ఎయిర్‌వాల్ లీకేజీతో పంటచేలలు నీటితో నిండిపోయాయని రైతులు వాపోయారు. హార్వెస్టర్ యంత్రాలతో కోతలు కోసే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రాత్రి నుంచి నీరు వృధాగా పోతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి సాగునీరు వృధా కాకుండా చూడాలని, పంటలను కాపాడాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

# ధాన్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**- ధాన్యం రవాణా పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి: జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా అవసరమైన వాహనాలు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం రవాణా పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం రవాణా కోసం అవసరమైన మేర వాహనాలను సమకూర్చాలని కలెక్టర్ సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో ఎక్కడ వాహనాలు లేకపోవడం వంటి ఇబ్బందులు రావడానికి వీలులేదని, టెండర్ లో సూచించిన నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం రవాణా సంబంధించి వాహనాలు అందుబాటులో లేవని తన దృష్టికి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని, వాహనాల సరఫరాకు ఇబ్బందులు ఉంటే ఇప్పుడే టెండర్లు రద్దు చేసుకోవాలని, టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అవసరమైన వాహనాలు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం రవాణా జరిగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీ మాల, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరం

## జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల: ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకురావాలి. సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ,ఈవ్ టీజింగ్,ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై విద్యార్థిని విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా ఎస్పీ అఖిల్ మహాజన్

హాజరై దిశానిర్దేశం చేశారు.. జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. విద్యార్థిని విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకరావలన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి ర్యాగింగ్ మొదటి దశలోనే కట్టడి చేయాలని,కలశాల యాజమాన్యాలు విద్యార్థుల అలవాట్లను, నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని తెలిపినారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం,వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదు అని తెలిపినారు.విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనేది లేకుండా స్నేహపూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ర్యాగింగ్ చేయడం నేరమని,ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ర్యాగింగ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియజేసి సమాచారం అందించాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలాంటి వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థినిలు మహిళలు మౌనం విడి ముందుకు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని, నిర్భయంగా ముందుకు వచ్చి మీ సమస్యలను చెప్పుకున్నప్పుడే మరింత భద్రత కల్పించగలువుతామని,మహిళలు,విద్యార్థినిలు జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు. పిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కళాశాల యాజమాన్యం, విద్యార్థిలు పాల్గొన్నారు.

# మెనూ పాటించని వార్డెన్ లపై చర్యలు తీసుకోవాలి

**– చలి దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా దుప్పట్లు పంపిణీ చేయాలి**

**– ఏఐఎస్ఎఫ్ జిల్లా రూరల్ మండల కార్యదర్శి నితిన్ మచ్చ**

**– ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి పత్రం**

జగిత్యాల: జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు సంబంధించిన హాస్టల్లో మెనూ ప్రకారం పలు వార్డెన్లు భోజనం అందించడం లేదు వార్డెన్ లో స్థానికంగా ఉండాలన్న నిబంధన ఉన్న పలువురు ఉండడం లేదు దానికి జిల్లా స్థాయి అధికారు లు కనీస పర్యవేక్షణ లేకుండా పోయి తొత్తుగా మారి వార్డెన్ లకు సహకరిస్తున్నారని అన్నారు కూరగాయలు వంట సామాగ్రి సంబంధించి నాణ్యత లోపిస్తున్నాయి మరియు విద్యార్థులకు సంబంధిం చి సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు బీసీ గర్ల్స్ హాస్టల్లో 200 పైన విద్యార్థులు హాస్టల్ విద్యను అభ్యసిస్తున్నారు సరైన టాయిలెట్స్ లేవు మరొక హాస్టల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది అదేవిధంగా పోలీసు వారు హెడ్ కోటర్ సంబంధించి బిల్డింగు ఎస్టీ హాస్టల్ కు సంబంధించింది దాన్ని తక్షణమే ఖాళీ చేయించాలి ఎన్నోసార్లు గత అధికారులు దృష్టికి తీసుకువచ్చిన ఇప్పటికీ అది ఖాళీ చేయలేదు ఎస్టి ప్రీమెట్రిక్ పోస్టు మెట్రిక్ విద్యార్థులు ఒకే భవనంలో ఉంటున్నారు అలాగే ఎస్సీ వన్ టు ప్రీ మెట్రిక్ విద్యార్థులు కూడా ఒకే భవనంలో ఉంటున్నారు. చలికాలం ప్రారంభమైంది విద్యార్థులకు అందిచాల్సిన దుప్పట్లు వంటి సామాగ్రిని తక్షణమే అందించాలి అదే విధంగా జగిత్యాల పట్టణ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ (బాలికల) కళాశాలలో విద్యార్థులకు సరిపడా గదులు లేవు శిథిలావస్థలో ఉన్నాయి అట్లాగే టాయిలెట్ సమస్యలు ఉన్నాయి విద్యార్థులకు సరిపడలేవు మరియు తలపులు కిటికీలు కూడా లేవు చల్లా చదరంగా ఉన్నాయి బాగు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి ఆఫీస్ కార్యాలయం జగిత్యాల మన సమీకృత భవనంలోకి మర్చబడినప్పటికీ ఒక గది ఇప్పటికీ కళాశాలలోనే ఉంది దాన్ని ఖాళీ చేయించాల్సిన అవసరం ఉంది విద్యార్థులకు ఒక గది అందు బాటులోకి వస్తుంది. అదేవిధంగా ప్రభుత్వ బాలికల పాఠశాల కు సంబంధించి విద్యార్థులకు సరిపడ గదులు లేవు బిల్డింగు కూల్చి రెండు సంవత్సరాలు కావస్తుంది ఇప్పటికీ దాన్ని నిర్మించిన దాఖలు లేవు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గత కలెక్టర్లు వచ్చి నిర్మిస్తామని వాగ్దానం చేసినప్పటికీ ఇప్పటికీ ఇంకా నిర్మాణం కూడా లేదు దీనివల్ల పేద విద్యార్థులు తరగతి గదులు లేక ఇరుకు గదుల్లో విద్యను అభ్యసిస్తూ ఇబ్బందులకు గురవుతూ చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొంది విద్యార్థులకు అసలు కనీస మరుగుదొడ్లు కూడా లేవు మరియు పక్కనే ఉన్న ఆనంద నిలయంలో ఉన్న వాటిని విద్యార్థులు ఉపయోగిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పై సమస్యలు పరిష్కారానికి కార్యచరణ రూపొందించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించ గలరని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి నితిన్ మచ్చ, సహాయ కార్యదర్శి తోట రాజేష్, ప్రణయ్, అరుణ్ కుమార్, నరేష్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# మెయిన్ అంగన్‌వాడీల్లో 'మినీ' జీతాలా..?

**– వేతనాల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునీత**

**– కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన**



ఆదిలాబాద్ టౌన్: మినీ అంగన్‌వాడీ నుంచి మెయిన్ అంగన్‌వాడీగా మార్చిన ప్రభుత్వం వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు సునీత అన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు వచ్చారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించి, సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మినీ అంగన్‌వాడీ లను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిందని చెప్పారు. కానీ, జనవరి నుంచి టీచర్లు, ఆయాలకు మినీ అంగన్‌వాడీ వేతనాలే ఇస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర్వుల్లో కాదు.. ఆర్థిక శాఖలో కూడా వీరిని మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలని డిమాండ్ చేశారు. 13, 14 సంవత్సరాల నుంచి ఐసీడీఎస్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, కుల గణన సర్వే నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ మాట్లాడు తూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో 75 నుంచి వంద అంశాలను ఇచ్చారని, సర్వేకు అంగన్‌వాడీలను నియమించడం సరైంది కాదని అన్నారు. అంగన్‌వాడీల్లో ఎక్కువగా 7 నుంచి పదో తరగతి వరకు చదువుకున్న వారే ఉన్నారని, వారికి సర్వే నిర్వహించడం కష్టంగా మారుతుందని చెప్పారు. కేంద్రాలు మూసేసి సర్వే చేయాల్సి వస్తుంద న్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శి సురేందర్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షు లు వెంకటమ్మ, నాయకులు పార్వతి, భారతి, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

# వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర సర్వేను చేపట్టాలి

## మారుతి దివాకర్

హైదరాబాద్: వంద శాతం ఖచ్చితత్వంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమర్థవంతంగా చేపట్టాలని అంబర్ పేట్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ సూచించారు. అంబర్ పేట్ సర్కిల్ లో ఈ నెల 6వ తేదీ నుండి చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై సోమవారం సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు అంబర్ పేట లోని మహా రాణి ప్రతాప్ ఫంక్షన్ హాల్ లో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ మాట్లాడుతూ... నవంబర్ 6 నుండి ప్రారంభమయ్యే (సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నమోదు చేయాలని సూచించారు. అంబర్ పేట్ పరిధిలో 90 వేల ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్యుమరేటర్లను, సూపర్ వైజర్లను నియమించామని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ 150 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏదేని సందేహాలు ఉ న్నట్లైతే ఎప్పటికప్పుడు సంబంధిత సూపర్ వైజర్లను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. ఎన్యుమరేటర్లు మార్గదర్శకాల మేరకు సర్వే నిర్వహించాలని తెలిపారు. సర్వే చేసిన ప్రతి ఇంటికి స్టిక్కర్ ను అతికించాలని సూచించారు. సూపర్ వైజర్లు ఎన్యుమరేటర్ల పనితీరును పర్యవేక్షించడంతో పాటు సర్వే ప్రక్రియలో అవసరమైన సహాయం అందించాలన్నారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు శంకర్ రెడ్డి, రామ్మోహన్, రజిత లు హౌస్ హోల్డ్స్ షెడ్యూల్ సర్వే ఫారం, హౌస్ లిస్టింగ్ ఫారం, ఎన్యుమరేటర్ మార్గదర్శకాలు, స్టిక్కర్ తదితరాల గురించి వివరించారు. సర్వే నిర్వహణ, ఫారం నింపే విధానం ఇతర ముఖ్య వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సర్వే సమయంలో ఎదురయ్యే పలు సమస్యలు, వాటిని అదిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం సర్వే విషయమై పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 500 మందికి పైగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు శంకర్, రామ్మోహన్, రజిత, ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంబర్ పేట్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 36 ఏళ్ల కోహ్లీని కింగ్ మేకర్ చేసిన 36 రికార్డులు..



వెస్ట్ ఢిల్లీ కారిడార్‌ల నుంచి ఒక కుర్రాడు ఏదో ఒక రోజు ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తాడని ఎవరూ ఊహించలేదు? ప్రపంచ క్రికెట్‌కు రారాజుగా మారతాడని కూడా అనుకోలేదు?

ప్రపంచ క్రికెట్ ఛాతీపై అతని పేరు ప్రతి ఒక్కరి పెదవులపై నిలిచిపోయేలా చేస్తాడని కూడా తెలియదు? టీమ్ ఇండియాపై ప్రత్యర్థి జట్ల వ్యూహాలకు కేంద్ర బిందువుగా మారేంతగా తన ముద్ర వేసిన కింగ్ కోహ్లీ నేడు తన 36వ పుట్టిన రోజు సెలబ్రేట్ చేసుకుంటున్నాడు. నేడు విరాట్ భారత క్రికెట్‌కు బలం మాత్రమే కాదు.. ప్రత్యర్థులకు అతిపెద్ద డేంజరస్ మ్యాన్‌గా మారాడు. విరాట్ పుట్టిన రోజు సందర్భంగా.. తన కెరీర్‌లో సాధించిన 36 ఫీట్‌లు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

36 ఏళ్లు, 36 రికార్డులు.. విరాట్ కోహ్లీ కింగ్ ఆఫ్ క్రికెట్ బిరుదును నిజంగా సమర్థించే రికార్డులను ఓసారి చూద్దాం..

వన్డేల్లో అత్యంత వేగంగా 8000, 9000, 10000, 11000, 12000, 13000 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

ఐసీసీ ఈవెంట్లలో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన వారిలోనూ విరాట్ కోహ్లీ నంబర్ వన్.

ఐసీసీ ఈవెంట్లలో అత్యధికంగా మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు గెలుచుకున్న ఆటగాడిగా కోహ్లీ రికార్డు సృష్టించాడు.

ప్రపంచంలోని చురుకైన క్రికెటర్లలో, వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ.

ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండుసార్లు 11-11 సెంచరీలు చేసిన ఏకైక క్రికెటర్ విరాట్ కోహ్లీ.

వన్డేల్లో వరుసగా 3 సెంచరీలు సాధించిన ఏకైక కెప్టెన్ విరాట్.

ఐసీసీ నాకౌట్‌లలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ రికార్డు సృష్టించాడు.

ఐసీసీ నాక్ ఎయిట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ రికార్డు సృష్టించాడు.

మూడు ఐసీసీ ఈవెంట్లలో 50 కంటే ఎక్కువ సగటు ఉన్న ఏకైక ఆటగాడు విరాట్.

దశాబ్ద కాలంలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు.

దశాబ్ద కాలంలో అత్యధిక సెంచరీలు సాధించిన బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీ నిలిచాడు.

దశాబ్ద కాలంలో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డులు సాధించిన ఆటగాడిగా విరాట్ రికార్డు సృష్టించాడు.

అన్ని సేనా దేశాలలో టెస్ట్, %టాణ×% రెండింటిలోనూ సెంచరీలు సాధించిన ఇద్దరు భారతీయులలో విరాట్ పేరు చేరింది.

టెస్టుల్లో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో రెండుసార్లు 3 డబుల్ సెంచరీలు చేసిన రికార్డు విరాట్ కోహ్లీ పేరిట ఉంది.

ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు.

ఈ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా విరాట్ నిలిచాడు.

ఈ టీ20 ప్రపంచకప్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్‌గా విరాట్ నిలిచాడు.

ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ.

ఒక దశాబ్దంలో 20000 అంతర్జాతీయ పరుగులు చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు.

ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యంత వేగంగా 1000 వన్డే పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ విరాట్. 2011లో ఇలా చేయడం ద్వారా హాషీమ్ ఆమ్లా 15 ఇన్నింగ్స్‌ల రికార్డును బద్దలు కొట్టాడు.

రెండు జట్లపై వన్డేల్లో వరుసగా 3 సెంచరీలు సాధించిన తొలి బ్యాట్స్‌మెన్‌గా విరాట్ నిలిచాడు.

అతను మూడు ప్రధాన %×జజ% అవార్డులను గెలుచుకున్న మొదటి ఆటగాడు %–% సర్ గార్ఫీల్డ్ సోబర్స్ ట్రోఫీ, టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్, %టాణ×% ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ %–% అదే సంవత్సరంలో గెలుచుకున్నాడు.

2019 ప్రపంచకప్‌లో వరుసగా 5 అర్ధ సెంచరీలు సాధించిన తొలి కెప్టెన్‌గా నిలిచాడు.

టెస్టు కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ అత్యధికంగా 7 డబుల్ సెంచరీలు సాధించాడు.

ఐపీఎల్‌లో ఒక సీజన్‌లో అత్యధికంగా 973 పరుగులు చేసిన ఆటగాడిగా కూడా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు.

కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ వన్డేల్లో అత్యంత వేగంగా 3000 పరుగులు సాధించాడు.

వెస్టిండీస్ గడ్డపై భారత కెప్టెన్‌గా వన్డేల్లో అత్యధిక స్కోరు సాధించిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ రికార్డు సృష్టించాడు.

కెప్టెన్‌గా టెస్టుల్లో వేగంగా 4000 పరుగులు సాధించాడు.

భారత గడ్డపై ఆస్ట్రేలియాపై అత్యధిక వన్డే సెంచరీలు చేసిన బ్యాట్స్‌మెన్ విరాట్.

విరాట్ తన క్రికెట్ కెరీర్‌లో అత్యంత వేగంగా 30, 35, 40 వన్డే సెంచరీలు సాధించిన బ్యాట్స్‌మెన్.

ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై సెంచరీ చేసిన తొలి భారతీయుడు విరాట్.

ఐపీఎల్ (2016)లో ఒకే సీజన్‌లో అత్యధికంగా 4 సెంచరీలు సాధించిన తొలి బ్యాట్స్‌మెన్. అతని తర్వాత, జోస్ బట్లర్ కూడా 2022లో అదే సంఖ్యలో సెంచరీలు చేశాడు.

కెప్టెన్‌గా టెస్టుల్లో అత్యధిక స్కోరు 150కిపైగా విరాట్ ఖాతాలోనే చేరింది

టెస్టు క్రికెట్ చరిత్రలో వరుసగా 4 సిరీస్‌లలో 4 డబుల్ సెంచరీలు చేసిన ఏకైక బ్యాట్స్‌మెన్.

# పంత్ క్రీజ్‌లో ఉన్నంతవరకూ మేం భయపడ్డాం: అజాజ్ పటేల్



భారత పర్యటనలో అందరికంటే ఎక్కువగా రిషభ్ పంత్‌పైనే దృష్టి పెట్టామని.. అతడిని ఔట్ చేయడమే లక్ష్యంగా ఆడినట్లు న్యూజిలాండ్ స్పిన్నర్ అజాజ్ పటేల్ వెల్లడించాడు. టీమ్‌ఇండియాను 0-3 తేడాతో కివీస్ వైట్‌వాష్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఓ ఇంగ్లిష్ ఛానెల్‌తో అజాజ్ పటేల్ ప్రత్యేకంగా ముచ్చటించాడు. అజాజ్ మూడు టెస్టుల్లో 15 వికెట్లు తీసి సత్తా చాటాడు. మరీ ముంబయిలోని వాంఖడే వేదికగా జరిగిన టెస్టులో అద్భుత ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. 147 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌ను గెలిపించేందుకు రిషభ్ పంత్ (64) చాలా కష్టపడ్డాడు. అయితే, అజాజ్ బౌలింగ్‌లో వివాదాస్పద నిర్ణయంతో పెవిలియన్‌కు చేరాడు.

"మిడిలార్డర్‌లో రిషభ్ పంత్ కీలకంగా మారాడు. అతడు క్రీజ్‌లో ఉ న్నాడంటే ఏ జట్టుకైనా భయమే. మేం కూడా మూడో టెస్టులోనే కాకుండా సిరీస్ ఆసాంతం అతడిని త్వరగా ఔట్ చేయడంపైనే దృష్టిపెట్టాం. నిర్భయంగా ఆడే బ్యాటర్. అతడి ఫిలాసఫీ ఒకటే. క్రీజ్‌లో ఉన్నంత వరకూ దూకుడుగా ఆడేస్తాడు. అందుకే, అతడిని ఎంత త్వరగా ఔటైతే.. సమస్య త్వరగా పరిష్కారమైనట్లే" అని వెల్లడించాడు. రిషభ్ పంత్ ఆరు ఇన్నింగ్స్‌ల్లో 261 పరుగులు చేశాడు.

ఆసీస్‌లో పరిస్థితులు విభిన్నం..

ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత్ మరికొద్ది రోజుల్లో వెళ్లనుంది. ఈ క్రమంలో బోర్డర్ – గావస్కర్ ట్రోఫీపైనా అజాజ్ పటేల్ స్పందించాడు. "ఆస్ట్రేలియాలో పరిస్థితులు విభిన్నం. భారత్ జట్టులో నాణ్యమైన క్రికెటర్లు చాలా మంది ఉన్నారు. అయితే, ఇప్పుడు కివీస్ చేతిలో ఓటమిని అక్కడికీ తీసుకెళ్తే.. ఇబ్బందిగా మారుతుంది. ఆసీస్‌లో కొత్త మైండ్‌సెట్‌తో భారత్ ఆడాలి. ఆస్ట్రేలియాలో ఆడిన అనుభవం కలిగిన ప్లేయర్లూ ఉన్నారు. గెలుపోటములు క్రికెట్‌లో సహజమే. ఒత్తిడి మాత్రం ఎప్పుడూ ఉంటుంది. దానిని అధిగమిస్తే విజయం సొంతమవుతుంది" అని కివీస్ స్పిన్నర్ అజాజ్ పటేల్ తెలిపాడు.

# ఇకపై మీరెవరో.. నేనెవరో.. : ప్రీతి జింటాకు షాకిచ్చిన భారత పేసర్




పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు కేవలం ఇద్దరు ఆటగాళ్లనే పంజాబ్ రిటైన్ చేసుకుంది. యంగ్ బ్యాటర్స్ ప్రభుమాన్ సింగ్, శశాంక్ సింగ్?లను మాత్రమే వచ్చే సీజన్ కోసం జట్టుతో అట్టిపెట్టుకుని మిగిలిన అందరిని వేలానికి వదిలేసింది.

అన్ క్యాప్డ్ ప్లేయర్స్ ప్రభుమాన్ సింగ్?కు రూ.4 కోట్లు, శశాంక్ సింగ్?కు రూ.5.4 కోట్లు చెల్లించి పంజాబ్ రిటైన్ చేసుకుంది. తమ స్టార్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌ను విడుదల చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఖచ్చితంగా రిటైన్ చేసుకుంటారనుకుంటే బిగ్ షాక్ ఇచ్చింది. అర్ష్‌దీప్ సింగ్ సోషల్ మీడియా వేదికగా తన నిరాశను వ్యక్తం చేశాడు. సోషల్ మీడియాలో పంజాబ్ కింగ్స్ కు సంబంధించి అన్ని పోస్ట్‌లు, ఫోటోలను డిలీట్ చేశాడు. దీంతో రాబోయే సీజన్ లో పంజాబ్ అతన్ని తీసుకోనట్టు స్పష్టంగా అర్థమవుతుంది. తాజా పరిణామంతో రైట్ టు మ్యాచ్ కార్డు ద్వారా తీసుకునే అవకాశాలు లేనట్టే. వస్తున్న సమాచార ప్రకారం పంజాబ్ రూ. 18 కోట్ల రూపాయలు పెట్టి ఆర్షదీప్ సింగ్ ను తీసుకోవడానికి ఆసక్తి చూపించలేదట. ఈ కారణంగానే అతన్ని మెగా ఆక్షన్ లోకి వదిలేసినట్టు నివేదికలు చెబుతున్నాయి.2019 లో పంజాబ్ జట్టులో చేరిన అర్ష్‌దీప్ సింగ్ ఆ జట్టుకు మూల స్థంభంలా నిలిచాడు. పంజాబ్ తరపున 65 మ్యాచ్ ల్లో 76 వికెట్లు తీసి అత్యంత నిలకడగా రాణించాడు. ఈ ప్రదర్శనతో భారత క్రికెట్ జట్టులో స్థానం సంపాదించాడు. ఇటీవలే జరిగిన టీ20 వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టులో అర్ష్‌దీప్ సింగ్ సభ్యుడు. అర్ష్‌దీప్ సింగ్ తో పాటు హర్షల్ పటేల్, సామ్ కర్రాన్, జానీ బెయిర్‌స్టో, లియామ్ లివింగ్‌స్టోన్ వంటి స్టార్ ప్లేయర్లను పంజాబ్ కింగ్స్ వదిలేసుకుంది.ఇండియన్ ప్రీమియర్ లీగ్ మొదలై 16 సీజన్లు గడిచినప్పటికీ ఇప్పటి వరకు పంజాబ్ కింగ్స్ ఒక్కసారి ఐపీఎల్ టైటిల్ గెలవలేదు. కేవలం ఒక్కసారి మాత్రమే ఫైనల్ వరకు చేరుకుంది. ఈ ఫర్మామెన్స్ మినహా ఇస్తే... ప్రతి సీజన్?లోనూ చెత్త ప్రదర్శనతో టైటిల్ గెలవకుండానే పంజాబ్ కింగ్స్ వెనదిరిగింది.దీంతో వచ్చే సీజన్?లో ఎలాగైనా టైటిల్ గెలవడమే లక్ష్యంగా పెట్టుకున్న పంజాబ్ జట్టు మొత్తాన్ని ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యింది. ఏకంగా రూ.110.5 కోట్లతో పంజాబ్ మెగా వేలంలో పాల్గొననుంది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**